## తమిళనాట సీన్ రివర్స్-మ్యాట్రిజ్ సర్వేలో షాకింగ్ రిజల్ట్స్..!



# బలగం TV
# BALAGAM

నిజమే బా బలం..ప్రజలే మా బలగం

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు..
9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు..!



మిగతా 2లో..

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం, 18 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-4

# తన గొయ్యి తానే తీసుకుంటున్న ట్రంప్..??



**న్యూఢిల్లీ, మార్చి 18:** ఒక దేశం.. మరొక దేశంపై దాడి చేసి, ప్రతీకారం తీర్చుకుంటే, దాన్ని సాధారణంగా "యుద్ధం" అంటారు. అయితే, ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను మాత్రం వైట్ హౌస్ "యుద్ధం" అని చెప్పడానికి నిరాకరిస్తోంది. ఇటీవల హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ మాట్లాడుతూ.. "మేము యుద్ధంలో లేము" అని.. అమెరికాకు "యుద్ధంలో పాల్గొనే ఉద్దేశం లేదు" అని ప్రకటించారు. కానీ ఇరాన్ పై అమెరికా జరుపుతున్న మారణకాండలో ఇప్పటికే వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో వందలాది మంది చిన్నారులు కూడా ఉన్నారు. ఇరాన్‌లో 1,300 మందికి పైగా, వారిలో 200 మందికి పైగా చిన్నారులు మరణించినట్లు నివేదికలు ఉన్నాయి. లెబనాన్ లో 800 మందికి పైగా, వారిలో 100 మందికి పైగా చిన్నారులు మరణించారు. 8,15,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. అలాగే సాధారణ అమెరికన్లు కూడా ఈ యుద్ధానికి భారీ మూల్యం చెల్లిస్తున్నారు. ఈ యుద్ధం ఎప్పుడు.. ఎలా ముగుస్తుందో ఎవరికీ తెలియదు. అయితే.. దీని కారణంగా అమెరికన్లు మరింత పేదలుగా మారతారని ఖచ్చితంగా చెప్పొచ్చు. అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్షంగా, అలాగే పరోక్షంగా చాలా ప్రభావాలు పడుతున్నాయి. గతవారం పెంటగాన్ అధికారులు చట్టసభ సభ్యుల ప్రైవేట్ సమావేశంలో ఇరాన్ తో యుద్ధానికి ఆరు రోజుల్లోనే వి11.3 బిలియన్లు ఖర్చయిందని తెలిపారు. ఈ వి11.3 బిలియన్లలో మరమ్మత్తుల అంచనాలు లేదా నష్టాల భర్తీని చేర్చలేదు. మొదటి దాడులకు ముందు ప్రాంతంలో దళాలను, యుద్ధ నౌకలను మోహరించిన ఖర్చులు కూడా ఇందులో లేవు. "ది గార్డియన్" పత్రికకు ఇతర వర్గాలు తెలిపిన వివరాల మిగతా 2లో..

# రజనీకాంత్ ఇంటికి విజయ్..?

### ఎన్నికల వేళ బిగ్ ట్విస్ట్..!



**న్యూఢిల్లీ, మార్చి 18:** తమిళనాడులో ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ప్రస్తుతం అరవ రాజకీయం అంతా దళపతి విజయ్ చుట్టూనే తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ టీవీకే పార్టీ పెట్టిన సంగతి తెలిసిందే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేస్తున్న ఆయనకు ఇప్పుడు రోజుకో చిక్కు వచ్చి పడుతోంది. కరూర్ తొక్కిసలాట ఘటన నుంచి మొదలు.. ఇప్పుడు తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ వ్యవహారం వరకూ అన్నీ ఆయన మెడకు చుట్టుకుంటున్నాయి. ఇప్పటికే కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ కోర్టు చుట్టూ విజయ్ తిరుగుతున్నారు. విజయ్ ను ఎలాగైనా ఎన్డీయే కూటమిలోకి లాగాలని బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. కానీ విజయ్ ఎంట్రీని ఏఐఏడీఎంకే మాత్రం సహించడం లేదు. మరోవైపు విజయ్ కు సొంత ఇంట్లోనే తీవ్రమైన వ్యతిరేకత ఉంది. విజయ్ భార్య సంగీత విడాకులు కోరుతూ ఇటీవల ఓ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక విజయ్ చివరగా నటించిన జన నాయగన్ మూవీ విడుదలకు సెన్సార్ బోర్డు నో చెప్పింది. ఈ పరిణామాల మధ్య విజయ్ కు మరో బిగ్ షాక్ తగిలింది. టీవీకే పార్టీ ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ పై సంచలన ఆరోపణలు చేశారు. రజనీకాంత్ రాజకీయాల్లోకి రావాలనుకున్నప్పుడు డీఎంకే పార్టీ ఆయన్ను మిగతా 2లో..

### ఆ క్లెయిమ్ లపై రైతులకు కేంద్రం

# శుభవార్త..



లోక్ సభలో రైతు సంక్షేమం కోసం కేంద్రం చేస్తున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాల గురించి సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టిందని ఆయన వెల్లడించారు. రైతుల బీమా క్లెయిమ్ లపై మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులకు బీమా క్లెయిమ్‌లు సకాలంలో అందేలా కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. గతంలో రైతులు పంట నష్టపోయిన తర్వాత బీమా క్లెయిమ్‌లు తమ ఖాతాల్లో జమ కావడానికి నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. ఈ ఆలస్యం రైతులను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులో క్లెయిమ్ ఇవ్వకుంటే 12 శాతం వడ్డీతో ఇవ్వాలి ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

## ఆధారాలు ఇవే.. కేటీఆర్

# రాజీనామా చేయాలి

### కేటీఆర్ సవాల్ పై మంత్రి సీతక్క



**న్యూఢిల్లీ, మార్చి 18:** తెలంగాణలోని మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ. 57,000 కోట్ల రుణాలు ఇచ్చినట్లు రిపోర్టులు చూపిస్తే రాజీనామా చేస్తానన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ పై మంత్రి సీతక్క స్పందించారు. అందుకు సంబంధించిన ఆధారాలు విడుదల చేశారు. కేటీఆర్ ఇచ్చిన సవాల్‌కు కట్టుబడి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాలకు రూ. 57,000 కోట్లు రుణాలు ఇవ్వడమే కాకుండా వడ్డీ భారాన్ని సైతం ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ఇప్పటివరకు రూ. 1,390 కోట్లు వడ్డీ కింద చెల్లించామని మంత్రి సీతక్క తెలిపారు. అంతకుముందు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన కామెంట్స్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన ఆర్డర్ కాపీ చూపెడితే తక్షణమే తాను రాజీనామా చేసి, శాశ్వతంగా బయటికి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. లేదంటే తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు భట్టి రాజీనామా చేస్తారా..? అని అసెంబ్లీ వేదికగా సవాల్ విసిరారు. అయితే కేటీఆర్ సవాల్ పై స్పందించిన మంత్రి సీతక్క అందుకు సంబంధించిన ఆధారాలను వెల్లడించారు. ఈ మేరకు ఆధారాలు చూపిస్తూ.. కేటీఆర్ రాజీనామా చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. కేటీఆర్ తన మాటకు కట్టుబడి రాజీనామా చేయాలని అన్నారు. మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్ల బ్యాంకింగ్ రుణాలు ఇస్తే రాజీనామా చేస్తా అన్నారు .. ఇదిగో ఆధారాలు అంటూ వెల్లడించారు. మహిళా సంఘాల వడ్డీ భారాన్ని కూడా భరిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటి వరకు రూ. 1,390 కోట్ల వడ్డీలను చెల్లించినట్లు మిగతా 2లో..

### కాంగ్రెస్ సర్కార్‌పై అసెంబ్లీలో

# కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్-మార్చి 17 :** రాష్ట్రంలో 28 నెలల కాంగ్రెస్ పాలనలో ఎగ్గొట్టుడు, కూల గొట్టుడు, చెడగొట్టుడు తప్ప సాధించిందేమున్నదంటూ బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. 'ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ఎగ్గొట్టుడు.. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టుడు.. కేసీఆర్ పెట్టిన మంచి పథకాలను చెడగొట్టుడు.. ఇదే కాంగ్రెస్ పాలన' అని మూడు ముకల్లో అభివర్ణించారు. మొదటి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తూ సీఎం రేవంత్ సంతకం చేశారని చెప్పారని, మరి ఆ ఫైల్ ఏమైంది? అని ప్రశ్నించారు. ప్రజల సాక్షిగా బహిరంగ వేదికపై ముఖ్యమంత్రి సంతకం చేసిన ఆ ఫైల్ మాయమైతే ఎలా అని, దీనిపై ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం సంతకానికే దికులేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు మిగతా 2లో..

# నా పదవి ఉంటదో, లేదో తెల్వదు..



- ఇక మంత్రివర్గ విస్తరణపై నేనేం చెబుతా..
- మంత్రి శ్రీధర్‌బాబు సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్-మార్చి 17 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు పదే పదే ఢిల్లీకి వెళ్తుండటంపై శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సంచలన వ్యాఖ్య లు చేశారు. 'జాతీయ పార్టీగా అధిష్ఠానం ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లాల్సిందే. ఒకవేళ పిలిచినప్పుడు ఢిల్లీకి వెళ్లకపోతే మా ఉద్యోగాలు ఊడిపోతయి. మాకు ఉద్యోగాలు ఎవరిస్తారు?' అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధామిచ్చారు. పారిశ్రామిక భూముల అమ్మకానికి సంబం ధించిన హిల్ట్ పాలసీ అమలును ఇంకా మొదలు పెట్టలేదని తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్‌లో ఉన్నారా? అనే ప్రశ్నకు స్పందిస్తూ, ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నట్టు స్పీకర్ తీర్పు ఇచ్చారని, కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీతో కలిసి పని చేస్తున్నారని అన్నారు.పదేండ్లపాటు తానే ముఖ్యమంత్రినని రేవంత్‌రెడ్డి చెప్పుకోవడంపై స్పందిస్తూ... సీఎం కుర్చీలో కూర్చున్న వ్యక్తి మరికొంత కాలం ఆ కుర్చీలో కూర్చోవాలనుకోవడం మిగతా 2లో..

### పార్టీ మారే పరిస్థితికి

# కారణమెవరు..



### కాంగ్రెస్ అధిష్ఠానాన్ని నిలదీసిన జీవన్ రెడ్డి

**జగిత్యాల, మార్చి 17 :** పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లగొట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నలభై ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న తాను ఇప్పుడు విడిచిపెట్టే పరిస్థితి వచ్చిందంటే దానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కారకుడని, అందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా బాధ్యత ఉన్నదని అన్నారు. మంగళవారం ఆయన జగిత్యాలలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన పార్టీని వీడిపోవాలని ఎవరూ అనుకోరని అన్నారు. సంజయ్‌కుమార్ అసలు ఏ పార్టీలో ఉన్నారో ఆయనకు తెలుసా? అని ప్రశ్నించారు. సంజయ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ ప్రకటిస్తే.. సంజయ్ తనతో కలిసి పనిచేస్తాననడం ఏంటని నిలదీశారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉడుం సొచ్చినట్టు సొచ్చాడని, ఉడుం సొచ్చిన ఇంటిని వదిలిపెట్టక తప్పదని పేర్కొన్నారు.అభివృద్ధి కోసం ముఖ్యమంత్రితో కలిసి పని చేస్తున్నానని ఎమ్మెల్యే మాటిమాటికి అంటున్నారని, ఇది వినడానికి విడ్డూరంగా ఉన్నదని అన్నారు. అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమంటే కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో కల్పించుకోవడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేయడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో వేలుపెట్టడమా? అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినా.. గెలువకపోయినా ప్రజాసంక్షేమం కోసం, మిగతా 2లో..

## వెలుగుమట్ల బాధితుల కోసం

# కవిత మరో షాకింగ్ స్టెప్..



**న్యూఢిల్లీ, మార్చి 18:** వెలుగు మట్లలో సామాన్య నిరుపేదల పక్షాన కవిత తన పోరాటాన్ని ఆపలేదు. తాజాగా బాధితులందరికీ న్యాయం కోసం నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటుచేసి వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా పోరాటం చేయడానికి నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.రిటైర్డ్ జడ్జి, ఆర్మీ మాజీ మేయర్, ప్రొఫెసర్లు, లాయర్లు, సామాజిక వేత్తలు, జర్నలిస్టులతో కమిటీ వేసినట్టు కవిత పేర్కొన్నారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం కోసం నిజ నిర్ధారణ కమిటీ బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వం వెంటబడుతుందని కవిత స్పష్టం చేశారు. ప్రొఫెసర్ కోదండ రాం, హరగోపాల్, ఆకునూరి మురళి లాంటి వాళ్లు వెలుగుమట్ల లో జరిగిన ఘటన పైన స్పందించాలన్నారు కవిత. నిజ నిర్ధారణ కమిటీని వెలుగుమట్లలో ప్రభుత్వం ఎంత కర్కషంగా వ్యవహరించిందో అక్కడకు వెళ్లి పరిశీలించాలన్నారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇచ్చి పేదవారికి న్యాయం జరిగేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. వాళ్ళ మనుగడ బాధ్యత ప్రభుత్వానిదే తాము ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీకి ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు సంపూర్ణంగా సహకరించాలని కోరుతున్నానన్నారు. బాధితుల ఇళ్లు పూర్తయ్యే వరకు వాళ్ల మనుగడకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ రాష్ట్ర ప్రభుత్వం చాలా దారుణంగా వెలుగుమట్లలో ఎటువంటి నోటీసులు, హెచ్చరిక లేకుండా పేదలకు సంబంధించిన 750 ఇళ్ళను కూల్చేసిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాపోరాటాలకు గెలుపు ఉంటుంది ధర్మసమాజ్ పార్టీ, జాగృతి ఈ అన్యాయం పై చేసిన పోరాటంతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. కూల్చిన చోటే 350 మందికి పట్టాలు ఇస్తామని, మరో 110 మందికి వాళ్ల గ్రామాల్లో ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది అన్నారు కవిత. ప్రభుత్వం స్పందించిన తీరును బట్టి ప్రజాస్వామ్యంలో ప్రజాపోరాటాలకు గెలుపు ఉంటుందని భావిస్తున్నామన్నారు. అయితే 750 మంది ఇళ్లను కూల్చేసి, 460 మందికి మాత్రమే ఇళ్లను ఇస్తామంటున్నారు. సంపూర్ణ న్యాయం జరిగేవరకు మిగతా 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## రజనీకాంత్ ఇంటికి విజయ్..?

భయపెట్టిందని.. దాంతో ఆయన వెనక్కి తగ్గారని సంచలన ఆరోపణలు చేశారు. అధవ్ అర్జున వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అధవ్ అర్జునతో పాటు టీవీకే అధ్యక్షుడు విజయ్ కూడా రజనీకాంత్ కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్స్ వినిపించాయి. ఈ క్రమంలో సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ లేఖను కూడా రిలీజ్ చేశారు. 'కాలం మాట్లాడదు కానీ సమయం వచ్చినప్పుడు సమాధానం చెబుతుంది' అని లేఖలో రజనీకాంత్ పేర్కొన్నారు. అధవ్ అర్జున వ్యాఖ్యలను ఖండించారు. తనకు మద్దతుగా నిలిచిన వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని లేఖలో స్పష్టం చేశారు. అయితే తాజాగా టీవీకే పార్టీ ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున రజనీకాంత్ కు క్షమాపణలు చెప్పారు. తన మాటలు ఆయన్ను బాధపెట్టి ఉంటే క్షమించాలని ఓ బహిరంగ సమావేశంలో అధవ్ అర్జున మాట్లాడారు. అయితే విజయ్ సైతం రజనీకాంత్ ను కలవాలని సోషల్ మీడియాలో పోస్టులు ప్రత్యక్షం అవుతున్నాయి. ఈ మేరకు ప్రముఖ ఫిల్మ్ క్రిటిక్ రమేశ్ బాలా.. తన ఎక్స్ మాధ్యమం వేదికగా పోస్టు చేశారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో రజనీకాంత్ ను తన నివాసంలో విజయ్ సమావేశం కావడం ఉత్తమం అని అభిప్రాయపడ్డారు. సినిమా ఇండస్ట్రీలో రజనీను విజయ్ రోల్ మోడల్ గా భావిస్తారని.. తమిళనాట ఎన్నికల నేపథ్యంలో రజనీకాంత్ బ్లెస్సింగ్స్ విజయ్ కు ఎంతో అవసరమని తెలిపారు. తలైవా ఎప్పుడూ విజయ్ మంచినే కోరుకున్నారని అన్నారు. ఈ క్రమంలో విజయ్.. రజనీను కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఆధారాలు ఇవే.. కేటీఆర్ రాజీనామా చేయాలి

ఆధారాలు వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 4 వేల కోట్ల వడ్డీలను మహిళా సంఘాలకు ఎగ్గొట్టారని మండిపడ్డారు. మీరు అభయహస్తం నిధులను కాజేశారంటూ మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఈ మేరకు తక్షణమే కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.


## తన గొయ్యి తానే తీసుకుంటున్న ట్రంప్..??

ప్రకారం, అసలు ఖర్చు బహుశా చాలా ఎక్కువగా ఉండొచ్చు. ప్రభుత్వం తన పౌరుల గురించి నిజంగా పట్టించుకునే దేశంలో ఉన్నామని ఒక్కసారి ఊహించండి. కేవలం రెండు వారాలకు పైగా యుద్ధానికి అయ్యే వి12 బిలియన్లతో ఎంతమంది ప్రజల జీవితాలను మెరుగుపరచగలమో చూడండి.. అని పలువురు నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అమెరికాలో పాఠశాలలను బాగుచేయడం కంటే ఇరాన్ లో పాఠశాల పిల్లలపై బాంబులు వేయడం చాలా ముఖ్యమని ఫైర్ అవుతున్నారు. ఇరాన్ లోని పాఠశాలపై దాడి చేసిన టోమాహాక్ క్రూయిజ్ క్షిపణికి సుమారు వి2.5 మిలియన్లు ఖర్చవుతుంది. పిల్లలను చంపడం చౌక కాదని మండిపడుతున్నారు. అలాగే అమెరికా వ్యాప్తంగా సుమారు 90 శాతం మంది ఉపాధ్యాయులు తమ తరగతి గదుల సామాగ్రి కోసం సగటున సంవత్సరానికి వి500 నుండి వి900 వరకు తమ సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారని నిధుల కొరతతో ఇలా చేస్తున్నారని తెలిపారు. ట్రంప్ విధించిన సుంకాల కారణంగా గత సంవత్సరంలో ఈ సామాగ్రి ఖర్చులు పెరిగాయి. ఆ వి12 బిలియన్లు అమెరికాలోని 3.7-3.8 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల నాలుగు సంవత్సరాలకు పైగా సామాగ్రి ఖర్చులను భరించగలదు. ప్రపంచంలోనే అత్యంత ధనిక దేశంలో, పిల్లలు నేర్చుకోవడానికి ఉపాధ్యాయులు తమ సొంత డబ్బును ఖర్చు చేయాల్సిన అవసరం లేకపోతే బాగుండేది కదా..? సగటు ఫెడరల్ విద్యార్థి రుణ బ్యాలెన్స్ వి39,547. ఈ వి12 బిలియన్లు సుమారు 300,000 మంది రుణాలను తీర్చగలదు. తద్వారా వారు ప్రస్తుతం విద్యార్థి రుణాలకు చెల్లిస్తున్న డబ్బును అద్దె, ఆహారం, కుటుంబ పోషణకు, అలాగే స్థానిక ఆర్థిక వ్యవస్థకు మళ్లించవచ్చు, రక్షణ కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్లకుండా నిరోధించవచ్చు. ఈ వి12 బిలియన్లు ఏడాదికి 1.62 మిలియన్ల పూర్తి పెల్ గ్రాంట్‌లను కూడా అందించగలదు. ఇది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని ఒక అవసర ఆధారిత ఫెడరల్ ఆర్థిక సహాయం; గరిష్ట అవార్డు ఏడాదికి వి7,000 పైనే ఉంటుంది. మరో దేశాన్ని నాశనం చేయడానికి ఖర్చు చేసిన ఈ డబ్బుతో 1.62 మిలియన్ల అమెరికన్ల జీవితాలు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది, ఇది ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టంగా తెలియజేస్తుంది. అమెరికాలో సుమారు 770,000 మంది నిరాశ్రయులు ఉన్నారు. నేషనల్ అలయన్స్ టు ఎండ్ హోమ్‌లెస్నెస్ విశ్లేషణ ప్రకారం, అమెరికా వ్యాప్తంగా నిరాశ్రయుల ఆశ్రయాలలో ఉన్న ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించడానికి ప్రస్తుతం ఉన్న నిధులకు అదనంగా వి9.6 బిలియన్లు అవసరం. రెండు వారాల కంటే తక్కువ యుద్ధ ఖర్చుతో నిరాశ్రయుల సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఇది బాగా ఖర్చు చేసిన డబ్బు అవుతుంది: అధ్యయనాలు ప్రకారం, ప్రజలకు గృహ వసతి కల్పించడం దీర్ఘకాలంలో పన్ను చెల్లింపుదారులకు డబ్బు ఆదా చేస్తుంది. ఈ వి12 బిలియన్లు తక్కువ ఆదాయ కుటుంబాలకు హీటింగ్ బిల్లులు చెల్లించడంలో సహాయపడే లో-ఇన్‌కమ్ హోమ్ ఎనర్జీ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (LIHEAP) కు రెండు నుండి మూడు సంవత్సరాలు నిధులు సమకూర్చగలదు. అలాగే, తక్కువ ఆదాయం ఉన్న ప్రజల ఆహారపు అలవాట్లను మెరుగుపరచడంలో సహాయపడే ది ఎమర్జెన్సీ ఫుడ్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (TEFAP) కు చాలా ఏళ్లు నిధులు అందించగలదు. ఇది బ్రాడ్‌బ్యాండ్ సేవలు, పాఠశాల భోజనాలు మరియు వైద్య రుణాలను తగ్గించడంలో సహాయపడగలదు. ఇది ఆరోగ్య సంరక్షణ మరియు విద్యకు నిధులు సమకూర్చగలదు. ఈ నిధులు మొత్తం అమెరికాను మరింత మెరుగ్గా మార్చగలవు. కానీ ఇలాంటి "రాడికల్ సోషలిస్ట్" ఆలోచనలు ప్రస్తుతం ఆచరణ సాధ్యం కాదని కొందరు వాదిస్తారు. అర్థంలేని యుద్ధాలపై ఖర్చును తగ్గించినట్లయితే, ఆయుధ తయారీదారులకు మరియు వారికి మద్దతు ఇచ్చే రాజకీయ నాయకులకు ఎంత నష్టం జరుగుతుందో ఊహించవచ్చు. ఖర్చు విషయానికి వస్తే, ఈ వి12 బిలియన్ల ధర కేవలం ప్రారంభం మాత్రమే. ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో ఎవరికీ తెలియదు. ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావాలు ఇప్పుడే మొదలవుతున్నాయి: అధిక కిరాణా ధరలు, పెట్రోల్ ధరలు, విద్యుత్ ఖర్చులు అన్నీ పెరగనున్నాయి. అయితే చింతించకండి, సామాన్య ప్రజలు బిల్లులు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నప్పటికీ, ట్రంప్స్ కుటుంబం ఈ మొత్తం నుండి మరింత ధనవంతులు కావడానికి ఒక మార్గాన్ని కనుగొంటుందని భావిస్తున్నారు. "మీరు దేనికి విలువ ఇస్తారో నాకు చెప్పకండి. మీ బడ్జెట్‌ను నాకు చూపండి, అప్పుడు మీరు దేనికి విలువ ఇస్తారో నేను చెప్తాను," అని జో బైడెన్ తరచుగా చెప్పేవారు. ఇరాన్‌పై బాంబు దాడి కోసం నిరంతరం విస్తరిస్తున్న బడ్జెట్ ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది: అమెరికా ప్రభుత్వం తన సొంత పౌరులకు అస్సలు విలువ ఇవ్వడం లేదు. పాఠశాలలు, మౌలిక సదుపాయాలు మరియు ఆరోగ్య సంరక్షణకు వెళ్లాల్సిన డబ్బు మరణం మరియు విధ్వంసం కోసం ఖర్చు చేయబడుతుందని చూడటం ప్రతి అమెరికా పన్ను చెల్లింపుదారుడిని దిగ్భ్రాంతికి గురిచేయాలి. ఇది నిజంగా "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ".. అని నిపుణులు తమ అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారావ్యక్తం చేస్తున్నారు.

## నా పదవి ఉంటదో, లేదో తెల్వదు..


సహజమని, కానీ, కాంగ్రెస్ పార్టీలో సీఎం ఎంపిక అధిష్ఠానం చేతుల్లో ఉంటుందని చెప్పా రు. మంత్రివర్గ విస్తరణపై ప్రశ్నించగా, తన పదవే ఉంటుందో ఊడుతుందో తెలియదని, అలాంటిది మంత్రివర్గ విస్తరణపై తానేం సమాధానం చెప్తానని వ్యాఖ్యానించారు. దీనిపై అంతా అధిష్ఠానం చూసుకుంటుందని, తాను ప్రభుత్వంలో ఒక సాధారణ, చిన్న మంత్రినని పేర్కొన్నారు. ఇప్పసారాకు సంబంధించి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన ప్రతిపాదన బాగున్నదని, ప్రభుత్వానికి, ప్రజలకు మేలు జరిగితే అమలు చేస్తామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో అసెంబ్లీ కమిటీలు ఏర్పాటు చేస్తామని, నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## వెలుగుమట్ల బాధితుల కోసం కవిత మరో షాకింగ్ స్టెప్..



పోరాటం ఇంకా చాలా మందికి న్యాయం జరగలేదన్నది స్పష్టంగా తెలుస్తోందన్నారు. జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ ప్రజాపోరాటాలకు ప్రభుత్వం దిగివచ్చింది. కానీ సంపూర్ణ న్యాయం జరగలేదని అభిప్రాయం వ్యక్తం చేసిన కవిత డిసెంబర్ 9 నాటికి వాళ్ల ఇళ్లను పూర్తి చేస్తామని చెబుతున్నారు. కానీ అప్పటివరకు ఆ పేదలు ఎక్కడ ఉండాలి? అని ప్రశ్నించారు. వాళ్ల ఇంటి అద్దె, పిల్లల చదువుకు కావాల్సిన సాయం ప్రభుత్వమే చేయాలన్నారు. మేధావుల మౌనం సమాజానికి నష్టం మేధావుల మౌనం సమాజానికి ఎంతో నష్టం చేస్తుందన్నారు. దయచేసి కోదండ రాం, హరగోపాల్, ఆకునూరి మురళి లాంటి వాళ్లు స్పందించాలన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు కవిత. ఏర్పాటైన నిజ నిర్ధారణ కమిటీని వాస్తవాలను తెలుసుకునేందుకు ఖమ్మం పంపించారు.

# హార్మూజ్ జలసంధిని అమెరికా టచ్ చేయలేదు..





హైదరాబాద్-మార్చి 17 : ప్రపంచ చమురు ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో.. హార్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకోవడానికి యుద్ధనౌకలను పంపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇరాన్ విధించిన ఈ దిగ్బంధాన్ని ఛేదించడం ప్రపంచ దేశాల బాధ్యత అని ఇటీవల ట్రంప్ స్పష్టం చేశారు. తమ ఎముఖఅటబత్రీ ఖతీమ్రఖు నౌకాదళానికి మద్దతుగా యూకే, ఫ్రాన్స్, జపాన్, చైనా వంటి మిత్రదేశాల నుంచి ట్రంప్ సహకారాన్ని ఆశించారు. అయితే దీనిపై అంతర్జాతీయంగా స్పందన మాత్రం నామమాత్రంగానే వస్తుంది. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నౌకాదళం కూడా ఈ కీలక సముద్రమార్గంపై దీర్ఘకాలిక ఆధిపత్యాన్ని సాధించలేదని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ప్రాముఖ్యత కలిగిన హార్మూజ్ జసంధి ప్రపంచ చమురు వాణిజ్యంలో 20-30 శాతాన్ని తన ద్వారానే నిర్వహిస్తుంది. ఇరాన్ నియంత్రణలోని ఉత్తర తీరాలు, ఒమన్ దక్షిణ ప్రాంతాలను ఇది కలిగి ఉంది. ఈ జలసంధి అత్యంత ఇరుకైన చోట 34 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉండగా.. షిప్పింగ్ లేన్లు ఒక్కోవైపు కేవలం 4 కిలోమీటర్లు మాత్రమే. ఈ భౌగోళిక లక్షణాలు నిరంతర ముప్పుల నుంచి సురక్షితమైన సరిహద్దును రక్షించడం అసాధ్యం చేస్తాయి. నిమిట్జ్-క్లాస్ యుద్ధనౌకలు, ఫీ-35 స్క్వాడ్రన్‌లతో సహ భారీ ఖూ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌లు ఇటువంటి పరిమిత జలాల్లో తిరగడానికి కిలోమీటర్ల కొద్దీ వ్యాసార్థం అవసరమై తీవ్ర ఇబ్బందులు పడతాయి. ఇరాన్ తీరంలోని ఎత్తైన భూభాగాల నుంచి ట్రక్కులపై మోహరించిన ఖలిజ్ ఫార్స్ బాలిస్టిక్ క్షిపణులు (పరిధి: 300 కి.మీ) ఓవర్-ది-హారిజన్ దాడులకు వీలు కల్పిస్తాయి. ఇవి ఖూ నౌకాదళ గన్‌లు, క్యారియర్ విమానాల ప్రయోగ సమయాల కంటే వేగవంతమైనవి. తక్కువ ఖర్చుతో దాడులను నిరోధించడానికి మైన్లు ప్రధాన ఆయుధంగా నిలుస్తున్నాయి. ఇరాన్ వేల సంఖ్యలో మైన్లను నిల్వ చేసింది, వీటిని IRGC స్పీడ్‌బోట్‌లు లేదా ఘదిర్ సబ్మెరైన్‌ల ద్వారా లోతులేని ప్రదేశాల్లో మోహరించవచ్చు. 1988లో జరిగిన 'ఎర్నెస్ట్ విల్' ట్యాంకర్ల ఎస్కార్ట్ వంటి గత ఖూ కార్యకలాపాల్లో చమురు రవాణా పాక్షికంగానే జరిగింది. ఇరాన్ దళాలు "స్వార్మ్ టాక్టిక్స్" (గుంపు దాడులతో) పూర్తి అడ్డుకట్ట వేశాయి. ట్రంప్ 2026 నాటికి ప్రతిపాదించిన నౌకాదళ విస్తరణ ఇదే నమూనాను పునరావృతం చేస్తుంది. ఇది జలసంధిలోని సహజ ఆకస్మిక దాడి మార్గాలను అధిగమించకుండా కేవలం అధికారాన్ని ప్రదర్శిస్తుంది. పూర్తి నియంత్రణకు ఇరాన్ 1,600 మైళ్ల తీరప్రాంతంపై గగనతల ఆధిపత్యం అవసరం. ప్రాంతీయ స్థావరాలు లేకుండా వేలాది సార్టీలను నిర్వహించడం అసాధ్యం. ఇరాన్ సైన్యం హార్మూజ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన లేయర్డ్ యాంటీ-యాక్సెస్/ఏరియా-డెనియల్ (A2/AD) నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. 3,000 కంటే ఎక్కువ యాంటీ-షిప్ క్రూయిజ్ క్షిపణులు (నూర్, ఖాదర్ రకాలు), హార్మూజ్-1 లాంటి బాలిస్టిక్ వ్యవస్థలు తీరప్రాంత గుహలలో దాచిన మొబైల్ లాంచర్‌ల నుండి ట్యాంకర్లు లేదా విలువైన యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకోవచ్చు. షాహెద్-136 డ్రోన్‌ల సమూహాలు కేవలం సంఖ్యాబలంతో ఏజిస్ రాడార్ డిఫెన్స్‌ను నిస్సహాయం చేస్తాయి. ఖూ ఇంటర్‌సెప్టర్‌లు డజన్ల కొద్దీ దాడులను అడ్డుకున్నా, వేల సంఖ్యలో వచ్చే వాటిని ఆపలేవు. IRGC నౌకాదళంలోని 20,000 కంటే ఎక్కువ వేగవంతమైన తీరప్రాంత దాడి నౌకలు "హార్నెట్స్ నెస్ట్" వ్యూహాలను (2002 మిలీనియం ఛాలెంజ్ వార్‌గేమ్‌లో ఖూ యుద్ధ సమూహం ధ్వంసం అయినట్లు) అమలు చేస్తాయి. ఆరు కిలో-క్లాస్ సబ్మెరైన్‌లు, డజన్ల కొద్దీ మినీ-సబ్‌లు పౌర రవాణా మధ్య సోనార్‌ను తప్పించుకుంటూ గల్ఫ్ జలాల్లో రహస్యంగా తిరుగుతాయి. ఇటీవలి సంఘటనలు ఈ వాస్తవాన్ని బలపరుస్తున్నాయి: మార్చి 14న ఖార్గ్ ద్వీపంపై ఖూ దాడులు జరిగినప్పటికీ, ఏ ఒక్క ట్యాంకర్ కూడా స్వేచ్ఛగా రాకపోకలు సాగించలేదు. IRGC స్పీడ్ బోట్ లు రాకపోకలను నిరంతరం అడ్డుకున్నాయి. ఇరాన్ యొక్క IRGC నౌకాదళం చౌకైన నావికా మైన్లు (6,000 వరకు నిల్వ), వేగవంతమైన పడవలు, పేలుడు డ్రోన్ లు, తీర-ఆధారిత యాంటీ-షిప్ క్షిపణులను, చిన్న నౌకలను "హిట్-అండ్-రన్" దాడులకు ఉపయోగిస్తుంది. ఖూ దాడుల్లో 16 మైన్ లేయర్లు, 30 నౌకలు ధ్వంసమైనా కూడా ఇరాన్ ఈ సామర్థ్యాలను కొనసాగిస్తోంది. రోజుకు 60 కంటే ఎక్కువ చమురు ట్యాంకర్లకు నిరంతర ఎస్కార్ట్ అవసరం. ఇది ఇండో-పసిఫిక్, యూరోపియన్ థియేటర్లలో ఖూ నౌకాదళం యొక్క 290 ఓడలకు తీవ్ర భారాన్ని మోపుతుంది. సరఫరా కార్యకలాపాలు ఇరాన్ క్షిపణిపరిధిలోని బహ్రెయిన్ లోని ఫిఫ్త్ ఫ్లీట్ హబ్ వంటి బలహీనమైన స్థావరాలపై ఆధారపడి ఉంటాయి. ట్రంప్ చేసిన బహుళజాతి విజ్ఞప్తికి ఎటువంటి స్పష్టమైన హామీలు లభించలేదు. సౌదీ అరేబియా, యూఏఈ వంటి గల్ఫ్ మిత్రదేశాలు తమ అబ్ ఖైఖ్-శైలి సౌకర్యాలు మరింత ప్రతీకార దాడులకు గురవుతాయనే భయంతో వెనకంజ వేశాయి. ఇంధన సంక్షోభాల మధ్య దౌత్యానికి ప్రాధాన్యతనిస్తూ, ఇరాన్ చమురుపై ఆధారపడిన జపాన్, యూరప్ దేశాలు ప్రకటనలు చేశాయి. ఖుఖ విదేశాంగ విధాన చీఫ్ కజా కల్లాస్ మాట్లాడుతూ, "ఎవరూ తమ ప్రజలను ప్రమాదంలో పడేయడానికి సిద్ధంగా లేరు. మనం దౌత్యపరమైన పరిష్కారాలను కనుగొనాలి. అప్పుడే ఆహార సంక్షోభం, ఎరువుల సంక్షోభం, ఇంధన సంక్షోభం వంటివి రాకుండా చూసుకోవచ్చు" అని పేర్కొన్నారు. ఖార్గ్ ద్వీపంపై బాంబు దాడి సమయంలో, ఇరాన్ చమురు ఎగుమతి టెర్మినల్స్‌ను ఖూ జాగ్రత్తగా విడిచిపెట్టింది. ఇది మొత్తం యుద్ధానికి వ్యతిరేకంగా వాషింగ్టన్ వైఖరిని, ఆక్రమణ కంటే ఆర్థిక ఒత్తిడికి ప్రాధాన్యత ఇస్తుందని సంకేతం ఇచ్చింది. ట్రంప్ "అందమైన నౌకాదళం" లో కనీసం రెండు ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ లు (ఖూూ అబ్రహం లింకన్, ఖూూ గెరాల్డ్ ఫోర్డ్) ఉండేవి. ప్రతి క్యారియర్‌కు రెండు డిస్ట్రాయర్‌లు, రెండు క్రూయిజర్‌లు పక్కన ఉంటాయి. ఇవన్నీ ఏజిస్-సమగ్రమై ాపీ-6 క్షిపణులు, వీఎ-60= హెలికాప్టర్‌లతో సన్నద్ధమై ఉన్నాయి. తాజా నివేదికల ప్రకారం, ప్రస్తుతం ఖూూ అబ్రహం లింకన్ మాత్రమే హార్మూజ్ జలసంధికి సమీపంలో ఉంది. నీటి అడుగున స్క్రీనింగ్ కోసం కనీసం నాలుగు వర్జీనియా-క్లాస్ అటాక్ బోట్లున్నాయి. మైన్ కౌంటర్ మెజర్లను లిటరల్ కంబాట్ షిప్‌లు ఖూచీూ పాత్ ఫైండర్ సర్వే నౌకల మద్దతుతో నిర్వహిస్తాయి. అయినప్పటికీ, 90కి పైగా విమానాలు, 500కి పైగా క్షిపణులు, టోమాహాక్ క్రూయిజ్ దాడులతో కూడిన ఈ భారీ సైనిక శక్తి హార్మూజ్ జలసంధిలోని కఠిన వాస్తవాల ముందు తడబడుతోంది. ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లకు 4-6 కిలోమీటర్ల మలుపు వ్యాసార్థం అవసరం. ఇది తీరప్రాంత రహస్య స్థావరాల నుంచి ప్రయోగించే ఖలిజ్ ఫార్స్ బాలిస్టిక్ లకు ఎయిర్ క్రాఫ్ట్ డెక్‌లను బహిర్గతం చేస్తుంది. ఫీ-35లు స్టీల్త్ అయినప్పటికీ, అధిక ముప్పు రవాణా సమయంలో క్యారియర్ కేటపుల్ట్ లు బలహీనంగా మారతాయి.

ఇరానియన్ నూర్ క్రూయిజ్ క్షిపణులు (150 కి.మీ పరిధి) అలల పైన దూసుకుపోతూ, ఓపెన్-ఓషన్ దాడుల కోసం రూపొందించిన SPY-1 రాడార్లను, ఈ ఇరుకైన "కిల్ జోన్‌లలో" త్వరగా నిండిపోయేలా చేస్తాయి. వర్జీనియా-క్లాస్ నౌకలు లోతైన నీళ్లలో బాగా పని చేసినా, హార్మూజ్ 100 అడుగుల లోతులేని జలాల్లో ఇబ్బందులు పడతాయి. ఇక్కడ ఇరాన్ యొక్క 6 కిలో డీజిల్ సబ్ మెరైన్ లు, 20కి పైగా ఘదిర్ మినీ-సబ్‌లు (టార్పెడోలు, మైన్ లతో సన్నద్ధం) అడుగు భాగంలో దాగి ఉండి దాడులకు పాల్పడతాయి. పౌర రవాణా నుండి వచ్చే సోనార్ గజిబిజి IRGC సబ్ మెరైన్ లను రక్షిస్తుంది, ఇవి గల్ఫ్ జలాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. 3,000 కంటే ఎక్కువ ఇరానియన్ యాంటీ-షిప్ క్షిపణులు, షాహెద్ డ్రోన్ గుంపుల ముందు డిస్ట్రాయర్‌ల భారీ మందుగుండు సామగ్రి త్వరగా అయిపోతుంది. మైన్-హంటర్‌లు స్పీడ్ బోట్ ల ఢీకొట్టడంతో సులభంగా ప్రమాదంలో పడతాయి. రోజువారీ 60కి పైగా ట్యాంకర్ ఎస్కార్ట్‌లు వారానికి 10,000 టన్నుల ఇంధనాన్ని ఉపయోగిస్తాయి. బహ్రెయిన్ లోని క్షిపణి బాంబులకు గురయ్యే కేంద్రం నుంచి సరఫరా జరుగుతుంది.

## పార్టీ మారే పరిస్థితికి కారణమెవరు..

జగిత్యాల అభివృద్ధి కోసం పనిచేసినట్టు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రజా గొంతుకను వినిపించినట్టు చెప్పారు. 2014లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి, బోర్నపెల్లి వంతెనకు రూ.70 కోట్లు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ అధిష్ఠానం కలుగజేసుకుంటే రాజీనామా యోచనను విరమించుకుంటారా? అని విలేకరులు అడగ్గా.. జగిత్యాలలో ఉత్పన్నమైన సమస్యకు పరిష్కారం కన్పించడం లేదని అన్నారు.ఏం చేస్తే పార్టీ నుంచి వెళ్లకుండా ఉంటారని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా.. రాష్ట్రంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, వారందరికి పార్టీతో సంబంధం లేదని ప్రకటించడంతోపాటు వారికి పార్టీ కార్యకలాపాల్లో భాగం లేకుండా చూడాలని కోరారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పడిన సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న తనకు ఇరవై నెలల గడువు ఉన్నదని, ఏకైక ఎమ్మెల్సీగా పనిచేసిన తనకు మంత్రి పదవి పొందేందుకు అర్హత లేదా? అని ప్రశ్నించారు. పదవులు వచ్చి నా.. రాకపోయినా.. ఆత్మగౌరవం, ప్రతి ఒక్కరికీ దక్కాల్సిందేనని స్పష్టంచేశారు. కార్యకర్తలు, నాయకులు, అనుచరులతో చర్చలు జరుపుతున్నానని, శ్రీరామ నవమి తర్వాత సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీని వీడే అంశంపై స్పష్టత ఇస్తానని తెలిపారు.

## కాంగ్రెస్ సర్కార్‌పై అసెంబ్లీలోకేటీఆర్ ధ్వజం

ఎలా నమ్ముతారని, ఇది జీరో వాల్యూ సర్కార్ అని ఎద్దేవా చేశారు. ఊరికే గాలివాటానికి ఇక్కడికి రాలేదని, తెలంగాణ ఉద్యమ ఉగ్గుపాలు తాగి వచ్చామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం కలిగితే అసెంబ్లీలోనైనా, వీధుల్లోనైనా పోరాడుతామని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై కేటీఆర్ మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ, గణాంకాలతో అధికారపక్షాన్ని ఉకిరిబికిరి చేశారు. కేటీఆర్ మాట్లాడుతుండగా మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అడుగడునా అడ్డుతగిలినా ఎక్కడా పక్కదారిపట్టకుండా పాయింట్ టూ పాయింట్‌గా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడారు.పదవులు కాదు పేరే శాశ్వతం.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటీఆర్ బమ్మెర పోతన పద్యాన్ని ఉటంకిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'కారే రాజులు రాజ్యముల్ గలుగవే.. గర్వోన్నతిం బొందరే.. వారేరీ సిరిమూట గట్టుకొని పోవంజాలిరే.. భూమిపై పేరైనం గలదే.. శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై ఈరే కోర్కెలు.. వారలన్ మరచిరే ఇక్కాలమున్ భార్గవ' అనే పద్యాన్ని చెప్పి దాని తాత్పర్యం వివరించారు. 'ఆడిన మాట తప్పొచ్చు. అబద్ధాలు ఆడొచ్చు. ఏం తప్పులేదు రాజా' అని బలిచక్రవర్తికి శుక్రాచార్యులు సలహా ఇచ్చారని వివరించారు. 'చరిత్ర నిండా చాలామంది రాజులు తమ దర్పంతో గర్వాతిశయాన్ని ప్రారంభించినవారున్నారు. నేనే రాజు నేనే మంత్రి అని మిడిసిపడిన వాళ్లు ఎవ్వరూ సంపదలు మూటగట్టుకు పోలేరు. పదవులను వెంటబెట్టుకొని పోలేరు. భూమిపై మిగిలేది పేరు మాత్రమే' అని బలి చక్రవర్తి చెప్పిన మాటలను ఉటంకించారు. అయితే, తాను శిబి చక్రవర్తి గురించి మాట్లాడుతుంటే గుమ్మడికాయల దొంగలా కాంగ్రెస్ నేతలు భుజాలు తడుముకుంటున్నారని ఎద్దేవాచేశారు.



గవర్నర్ ప్రసంగానికి విశ్వసనీయత లేదు..'పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికైనా, శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి విలువ, విశ్వసనీయత ఉండాలని కేటీఆర్ సూచించారు. 2023 డిసెంబర్ 15న నాటి గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగంలో 'ప్రజా సంక్షేమం కోసం ఆరు గ్యారెంటీలు ప్రకటించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి.. హామీలకు చట్టబద్ధత కల్పించే ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేయడం ఈ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం' అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 'ఆ సంకల్పం ఏమైంది? ఎక్కడపోయింది ఆ చిత్తశుద్ధి?' అని ప్రశ్నించారు.

సీఎం తొలి సంతకంపై సిట్ వేయాలి..'28 నెలలుగా గడిచినా సీఎం సంతకం చేసిన ఆ ఫైలు ఎక్కడపోయింది? కాకి ఎత్తుకుపోయిందా? ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా?' అని కేటీఆర్ నిలదీశారు. తొలి క్యాబినెట్‌లో ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఇప్పటికి 50 దాకా సమావేశాలు జరిగాయని ముఖ్యమంత్రి తొలిసంతకం చేసిన ఆ ఫైలు ఎలా మాయమైంది? బహిరంగంగా, వేదికపై సంతకం చేసిన ఆ ఫైలు ఎక్కడికి పోయింది? అని ప్రశ్నించారు. ఆ మాయమైన ఫైలు ఆచూకీ కోసం స్పెషల్‌గా ఒక సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.సీఎం తొలి సంతకానికి జీరో వాల్యూ..'కొందరి ఆస్తుల విలువను జీరో వాల్యూ చేసినట్టు ముఖ్యమంత్రి చెప్తున్నడు.. సీఎం చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ, ఆ ఫైల్‌కు జీరో వాల్యూ, మీరు ఇచ్చిన గ్యారెంటీ కార్డులకు, మీ డిక్లరేషన్లకు ప్రజల దృష్టిలో జీరో వాల్యూ.. మూసీలో మీరు కూల్చుతున్న ఇండ్లకు కాదు.. విశ్వసనీయతపై మీ ప్రభుత్వానికి ఈరోజు ప్రజల దృష్టిలో జీరో వాల్యూ ఉన్నది' అని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రచురించిన ఫుల్‌పేజీ యాడ్స్‌లోని ఆరు గ్యారెంటీ కార్డులను అసెంబ్లీలో ప్రదర్శించారు. 'ప్రతి కుటుంబానికీ 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గ్యారెంటీలతో అందే ప్రయోజనల విలువ రూ.రెండు లక్షల 50 వేలు. ప్రతి సంవత్సరం, ప్రతి కుటుంబానికీ రెండున్నరేండ్లు అయింది. రూ.రెండున్నర లక్షలు అందుకున్న ఒక్క కుటుంబాన్ని చూపిస్తారా?' అని ప్రశ్నించారు. కనీసం రెండు లక్షలైనా వచ్చాయా? ' అని నిలదీశారు.

## తమిళనాట సీన్ రివర్స్-మ్యాట్రిజ్ సర్వేలో షాకింగ్ రిజల్ట్స్..!



న్యూఢిల్లీ, మార్చి 18: తమిళనాడులో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే కూటమికీ, విపక్ష అన్నాడీఎంకే, విజయ్ కొత్త పార్టీ టీవీకేకు మధ్య త్రిముఖ పోరు తప్పదన్న అంచనాల నేపథ్యంలో తాజాగా వెలువడిన మ్యాట్రిజ్-అయాన్స్ సర్వే షాకింగ్ ఫలితాలు ఇచ్చింది. తమిళనాడులో ఇంతవరకూ పటిష్టంగా ఉందని, మరోసారి అధికారంలోకి రావడం తథ్యమని భావిస్తున్న డీఎంకే కూటమికి షాకిస్తూ.. బీజేపీ మిత్రపక్షాలు లీడ్ లో ఉన్నాయని ఈ సర్వే తేల్చింది. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి డీఎంకే నేతృత్వంలోని కూటమి కంటే స్వల్పంగా ముందంజలో ఉందని మ్యాట్రిజ్-ఐఎఎన్ఎస్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. రెండు ప్రధాన కూటముల మధ్య గట్టి పోటీ నెలకొని ఉందని ఇందులో తేలింది. చిన్న పార్టీలు పరిమిత సీట్లే గెల్చుకునే అవకాశం ఉన్నా.. కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని ఈ సర్వే సూచిస్తోంది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు ఈ అభిప్రాయ సేకరణ జరిగింది. మ్యాట్రిజ్-అయాన్స్ ఒపీనియన్ పోల్ ప్రకారం తమిళనాడులో ఈసారి బీజేపీ మిత్రపక్షాలు 114-127 సీట్లు గెల్చుకునే అవకాశం ఉందని తేలింది. అలాగే డీఎంకే మిత్రపక్షాలు కేవలం 104-114 సీట్లకు పరిమితం అవుతాయని సర్వే తెలిపింది. విజయ్ టీవీకేకు 6-12 సీట్లు దక్కుతాయని అంచనా వేసింది. ఇతరులకు 1-6 సీట్లు లభిస్తాయని ఒపీనియన్ పోల్ లో తేల్చారు. తమిళనాడులో అధికారం చేజిక్కించుకోవాలంటే ఏ పార్టీ లేదా కూటమికి అవసరమైన మ్యాజిక్ మార్క్ 118 సీట్లను బీజేపీ కూటమి సాధిస్తుందని ఈ సర్వే తెలిపింది. మరి ఈ అంచనాలు ఎంతవరకూ నిజమవుతాయో తేలాలంటే మే 4 వరకూ ఆగాల్సిందే.

## మోయినాబాద్ డ్రగ్స్ కేసు..

### 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు..!

హైదరాబాద్-మార్చి 17 :రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన మోయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు ను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. రిమాండ్‌లో ఉన్న నిందితులను విచారించడం, డ్రగ్స్ పార్టీపై లోతుగా విచారణను జరపడం కోసం తొమ్మిది మంది అధికారులకు బాధ్యతలు అప్పగించింది. సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేయనుంది.సిట్ చీఫ్‌గా చీఫ్‌గా చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా గ్రేహౌండ్స్ కమాండర్ రవీందర్ రెడ్డి, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఈగల్ డీఎస్పీలు బుచ్చయ్య, హరీశ్ చంద్రారెడ్డి, మోయినాబాద్ ఎస్‌హెచ్‌వో మల్లిఖార్జున, ఎస్ఐలు కోటేశ్వర్ రావు, వెంకన్న, సదత్ అలీలు ఎంపికయ్యారు.పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుఉన్నాయని సిట్ ఆరోపించింది. వెంటనే రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారులకు సిట్ లేఖ రాసింది. ప్రధాన నిందితులు పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేశ్ రెడ్డి, నమిత్ శర్మలను ఏడు రోజులకు కస్టడీ కోరింది.అలానే రితేశ్ రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు సిట్ లేఖ రాసింది.

balagamtv100@gmail.com

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రగతినగర్ బీజేపీ సమరభేరి



నిజాంపేట్ : ప్రగతినగర్ డివిజన్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శిస్తూ బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు నరేందర్ చౌదరి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రొఫెసర్ చంద్రమౌళి ముఖ్య అతి థిగా పాల్గొని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ చౌదరి మాట్లాడుతూ.. మోస పూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా 'రైతు భరోసా' నిధులు విడుదల సక్రమంగా చేయలేదని, రుణమాఫీ రైతులకు చేసే విషయంలో పూర్తి స్థాయిలో జరగలేదని, నిరుద్యోగులకు ఇస్తా మన్న నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాల ఊసే లేదని మండిపడ్డారు. మహిళలకు ఇస్తామన్న తులం బంగారం, స్కూటీల హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చుతూ సామాన్యులను రోడ్డున పడేస్తోందని, బడా బాబులు చేసిన భూకబ్జాల విషయంలో ఈ వ్యవస్థ పనితీరులో పారదర్శకత లోపించిందని విమర్శించారు. భూదాన్ భూములు: భూదాన్ భూముల కేటాయింపులో గందరగోళం నెలకొందని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నారు. పింఛన్లు: పింఛన్ల పెంపు హామీని అమలు చేయకుండా వృద్ధులను, దివ్యాంగులను ప్రభుత్వం వంచిస్తోందని ధ్వజమెత్తారు. జిహెచ్ఎంసి పరిధిని పెంచటం మూడు కార్పొరే షన్లుగా విభజించటం అనే అనేక విషయాలలో పారదర్శకత లేదని ప్రజలకు కల్పించవలసిన మౌలిక వసతులలో కూడా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని గుడ్ గవర్నెన్స్ ప్రజలు సుదూరంగా ఉన్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా మొం డివైఖరి వీడి, ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ మీడియా సెల్ కు కన్వీనర్ సుమన్‌రావు,జిల్లాఓబీసీ కార్యదర్శి జక్కుల రవికుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, డివిజన్ నాయ కులు గజ్జల్లిసంతోష్ కుమార్, ఎజల్లీ విజయ్ కుమార్, కే వేణుమాధవ్ తదితర కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో చలివేంద్రం ప్రారంభం



నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి ఎక్స్ రోడ్స్ వద్ద వాసవి క్లబ్ బాచుపల్లి మరియు శ్రీ ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం మరియు ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిధిగా కొలన్ హన్మంత్ రెడ్డి గారు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో వి 105 ఏ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి, అల్లాడి మహేష్, కొలన్ వీరేందర్ రెడ్డి , కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ కృష్ణ రెడ్డి,సంగమేశ్వర్, రాఘవేంద్ర, సుధాకర్, శ్రీకాంత్, శ్రీరామ్, ప్రభాకర్ విరేష్, శ్రీనివాస్, నితేష్, కార్తిక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## బడ్జెట్‌పై చర్చ 4 రోజులేనా..

- అసెంబ్లీ పనిదినాలు పెంచాలని హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్, మార్చి 17: ఈ నెల 30 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగిస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఆదివారాలతోపాటు కనీసం 31వ తేదీ వరకు అయినా నిర్వహించాలని తాము డిమాండ్ చేశామని బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత హరీశ్‌రావు చెప్పారు. 30 వరకు మాత్రమే అంటే, అందులో రెండు ఆదివారాలు, మూడు పండుగలు పోతే ఇక మిగిలేది ఎన్ని రోజులని నిలదీశామని తెలిపారు. కచ్చితంగా అసెంబ్లీ పని దినాలు పెంచాలని తాము కోరితే, సీఎంతో మాట్లాడి చెప్తామన్నారని వెల్లడించారు. సోమవారం బీఏసీ సమావేశం అనంతరం బీఆర్ఎల్పీ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బడ్జెట్ సెషన్స్ కనీసం 10 రోజులైనా నడుపకపోవడం దుర్మార్గమని విమర్శించారు. 'ఈరోజు అంటే 16న గవర్నర్ ప్రసంగం, 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ, 19న ఉగాది సెలవు, 20న బడ్జెట్. 21న రంజాన్ సెలవు, 22న ఆదివారం, 23, 24, 25, 26 తేదీల్లో బడ్జెట్‌పై చర్చలు, 27న శ్రీరామనవమి సెలవు, 28న బిల్లు, 29న ఆదివారం, 30న బిల్లుల ఆమోదం ఉంటుందని స్పీకర్ చెప్పారని వివరించారు. 'బడ్జెట్‌పై చర్చించేందుకు నాలుగు రోజులు ఎలా సరిపోతాయి? ఆదివారాలు కూడా అసెంబ్లీ పెట్టాలి. కనీసం మార్చి 31వ తేదీ వరకు సభ కొనసాగించాలని డిమాండ్ చేశాం' అని హరీశ్ పేర్కొన్నారు. హౌస్ కమిటీల ఏర్పాటు ఇప్పటికే ఆలస్యమైందని, ఎప్పుడు నియమిస్తారని తాము నిలదీసినట్టు హరీశ్‌రావు చెప్పారు. త్వరలో వేస్తామని మాట ఇచ్చారని తెలిపారు. ప్రతిరోజూ క్వశ్చన్ అవర్ పెట్టాలని తాము డిమాండ్ చేయగా, మంగ ళవారం ఒక్కరోజు మినహా ప్రతిరోజూ నిర్వహిస్తామని చెప్పినట్టు పేర్కొన్నారు. 'గతంలో సమావే శాలు ఉదయం 8.30 గంటలకే ప్రారంభమయ్యేవి. బీఆర్ఎస్ హయాంలో 9 గంటల నుంచి నిర్వహించాం. కాంగ్రెస్ సర్కార్ దానిని 10 గంటలకు మార్చింది. 9 గంటలకే సభ ప్రారంభమ య్యేలా చర్యలు తీసుకోవాలి' అని స్పీకర్‌ను కోరినట్టు చెప్పారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రైవేటు మెంబర్ బిల్లుకు అవకాశం ఇవ్వాలని, బీఆర్ఎస్ పార్టీ తరపున ఇద్దరికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరినట్టు గుర్తుచేశారు. బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతుంటే మధ్యలో మంత్రులు అడ్డుతగులకుండా కంట్రోల్ చేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బీఏసీ మినిట్స్ ఫాలో కాకపోతే వచ్చే బీఏసీని బాయ్‌కాట్ చేస్తామని స్పీకర్‌కు చెప్పినట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు. సభలో ముఖ్యమంత్రి అనేక అబద్ధాలు మాట్లాడుతూ అసెంబ్లీ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరినట్టు పేర్కొన్నారు. ప్రివిలేజ్ మోషన్స్ తీసుకునేది డిప్యూటీ స్పీకర్ అని, ఈ విషయంలో స్పీకర్ బాధ్యత తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. అసెంబ్లీ గ్రంథాలయం దారుణంగా ఉన్నదని బీఏసీలో ప్రభుత్వానికి సూచించామని తెలిపారు. 19 అంశాలపై చర్చించాలని కోరినట్టు వెల్లడించారు.

## కానిస్టేబుల్‌ను చంపింది మిత్రుడే



హైదరాబాద్, మార్చి 17: శుక్రవారం రాత్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధి చిలుకానగర్‌లోని ఆదర్శనగర్‌లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై శనివారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ సురేష్‌కుమార్ నేతృత్వంలో నిందితులను మీడియా ముందు హాజరు పరిచారు. డీసీపీ సురేష్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీకి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ సుధీర్‌కుమార్‌కు చిలుకనగర్‌లో ఉంటున్న సంతోష్‌నాయక్‌తో గత ఏడేళ్ల నుంచి పరిచయం ఉంది. ఇద్దరూ కలిసి తరచూ మద్యం సేవించేవారు. కాగా 4 రోజుల క్రితం రాంపల్లిలో సుధీర్ వాళ్ల బావ గృహ ప్రవేశం ఉండగా సుధీర్‌కుమార్ గృహ ప్రవేశానికి రావాలని సంతోష్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. అనంతరం సంతోష్ ఫోన్ చేయగా సుధీర్ లేపలేదు. దీంతో ఇద్దరు వాట్సాప్‌లో తిట్టుకుంటూ మెసేజ్‌లు పెట్టుకున్నారు. మాటామాటా పెరగడంతో శుక్రవారం రాత్రి 8:30 గంటలకు సుధీర్‌కు సంతోష్ ఫోన్ చేసి చిలుకానగర్‌లోని ఆదర్శనగర్‌కు రావాలని కోరాడు. దీంతో సుధీర్ ఆదర్శనగర్‌కు చేరుకున్నాడు. అప్పటికే దాడి చేయాలని సంతోష్ అతని స్నేహితుడు తరుణ్‌తో మద్యం మత్తులో సుధీర్ రాగానే విచక్షణా రహితంగా మెడ, కడుపులో చాకుతో పొడిచాడు. దీంతో సుధీర్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి నుంచి నిందితులు బైక్‌పై పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న ఉప్పల్ పోలీసులు శనివారం తెల్లవారుజామున నాగారం ఏరియాలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. 8 గంటల్లోనే కేసును ఛేదించిన ఎస్‌వోటీ, లా అండ్ ఆర్డర్ పోలీసులను సీపీ అవినాశ్ మహంతి అభినందించారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, అడిషనల్ డీసీపీ (ఎస్‌వోటీ) నర్సింహారెడ్డి, ఉప్పల్ డివిజన్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎస్‌వోటీ ఏసీపీ అంజయ్య, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు మాధవరెడ్డి, చిరంజీవి, రజినీకర్, వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీలో లుకలుకలు!

- అధికార పార్టీ సీనియర్ సభ్యుడిపై యువ శాసనసభ్యుల గుర్రు
- మీటింగ్ పెట్టేది మీరే.. లీక్ చేసేది మీరేనని యువ నేతల ఆగ్రహం
- వట్టి మాటలే తప్ప చేతలు లేవంటూ సీనియర్ లీడర్‌పై మండిపాటు
- రహస్య సమావేశ వివరాలు లీక్ చేస్తున్నారంటూ ఆగ్రహం
- నిలకడ లేని మనిషితో ప్రయాణం ప్రమాదకరమని నిర్ణయం



హైదరాబాద్, మార్చి 17: అధికార పార్టీలోని అసమ్మతి ఎమ్మెల్యే లు మరోసారి భేటీ అయ్యారా? 9 మంది యువ ఎమ్మెల్యేల బ్యాచ్ ఓ సీనియర్ ఎమ్మె ల్యే మీద గుర్రుగా ఉన్నారా? వట్టి మాటలే తప్ప ఆయనతో పని కాదని.. యువ ఎమ్మెల్యే లు అంచనాకు వచ్చారా? బాంబు పేలుస్తానని.. తనకు లాక్కోవడమే తప్ప అడుకోవడం రాదని.. బయట బీరాలు పలికి, లోపల తెరవెనుక ముఖ్యనేతకు సరెండర్ అయ్యారని వాళ్లు నమ్ముతున్నారా? ఎంత వరకైనా తెగిద్దామంటూ రహస్య సమావేశాలు పెట్టించి, ఇప్పుడు ఆయనే ముఖ్యనేతకు లీకులు ఇస్తున్నారా? గత అసెంబ్లీ సమావేశాల్లో ఓ పోలీసు అధికారి మీద ప్రివిలేజ్ మోషన్ పెట్టాలనుకు న్న విషయాన్ని కూడా ఆయనే లీక్ చేశారని కోపంగా ఉన్నారా?.. ఈ ప్రశ్నలకు అసమ్మతి బ్యాచ్‌లోని కొందరు ఎమ్మెల్యేల నుంచి 'అవును' అనే సమాధానమే వినిపిస్తున్నది. గతంలో ముఖ్యనేతపై తిరుగుబాటు చేసిన 9 మంది యువ ఎమ్మెల్యేలు ఇటీవల మరోసారి ఏకాంతంగా కలవడం కాంగ్రెస్ వర్గాల్లో అలజడి రేపుతున్నది. ప్రభుత్వ పెద్దలపై అసంతృప్తితో ఉన్న ఈ ఎమ్మెల్యేలు.. తొలి ఏడాదిలోనే హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో రహస్యంగా సమావేశమైన వార్త సంచలనంగా మారింది. మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఈ ఎమ్మెల్యేలకు నల్లగొండ జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న సీనియర్ ఎమ్మెల్యే టీం లీడర్‌గా ఉన్నట్టు గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆయన ఆధ్వర్యంలోనే మరోసారి వారు రహస్యంగా కలుసుకొని మా ట్లాడుకున్నట్టు తెలిసింది. మొదట ఒక పెండ్లి వేడుక కోసం హాజరై, ఆ తర్వాత వారు ప్రత్యేకంగా సమావేశం అయినట్టు తెలిసింది. కాగా ఇటువంటి సమావేశాలను ముందుండి నడిపించే హైదరాబాద్ శివారు ఎమ్మెల్యే ఈసారి డుమ్మా కొట్టినట్టు సమాచారం. రెండు గంటలపాటు వారు భేటీ అయినట్టు సమాచారం.

## డబుల్ బెడ్రూం ఇండ్లు కిరాయికిస్తే రద్దు చేస్తాం..

- అందులోనే ఉంటామని బాండ్ పేపర్ ఇవ్వాలి: పొంగులేటి



హైదరాబాద్, మార్చి 17: ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని అధికారులకు రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు పొంది వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్న వారికి, ఏండ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని, నోటీసులకు స్పందించని వారి ఇండ్లను రద్దు చేసి అర్హులకు కేటాయిం చా లని ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యా లయంలో సహచర మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌తో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇం డ్ల నిర్మాణం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లపై ఆయన సమీక్షిం చారు. డబుల్ బెడ్‌రూమ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర పథ కాల్లో ఇండ్లు పొంది నివాసం ఉండని ఇండ్లను మే 1నుంచి పరిశీలించాలని, వారికి నోటీసులిచ్చి స్పందించకపోతే కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టంచేశారు. నోటీసులకు స్పందించిన లబ్ధిదారుల నుంచి బాండ్ పేపర్‌పై తాము ఇకడే నివాసం ఉంటామని, లేదంటే రద్దు చేసే అధికారం ప్రభు త్వానికి అప్పగిస్తూ హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. హైదరా బాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి జిల్లాల క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని ఆయన సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోని కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పనిసరిగా కల్పించాలని, ఈ విషయంలో జీహెచ్ఎంసీ సహకారం తీసుకోవాలని మంత్రి సూచించారు. 22వేల ఇండ్లకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ వేచిఉండకుండా ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు కేటాయించాలని తెలిపారు. వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దె ప్రాతిపదికన కాకుండా వేలం ద్వారా విక్రయించాలని, తద్వారా వచ్చే డబ్బును అకడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్‌లో జమ చేయాలని ఆదేశించారు. ప్రజాప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని కోరారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మలాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కొత్త రైతులకు భరోసా లేనట్లే..

హైదరాబాద్,మార్చి 17: ఈ నెల 22న రైతులందరికీ ఎకరం భూమికి రైతుభరోసా విడుదల చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ, గతంలో రైతుబంధు, రైతుభరోసా పథకాల కింద సాయం అందించే తేదీకి 15 రోజుల ముందే కొత్త రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించేవారు. సీసీఎల్ఏ జాబితా ఆధారంగా ఒక కటాఫ్ తేదీని నిర్ణయించి ఆ తేదీలోపు రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి రైతుభరోసాలో అవకాశం కల్పించేవారు. దీంతో భూములను అమ్ముకున్న పాత రైతులు పోగా ప్రతి సీజన్‌లో దాదాపు 3 లక్షల మంది కొత్త రైతులు రైతుభరోసా పథకానికి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. కానీ, ఈసారి యాసంగి సీజన్‌లో రైతుభరోసా పంపిణీకి ప్రభుత్వం ఇప్పటికే తేదీని ప్రకటించినప్పటికీ కొత్త రైతుల రిజిస్ట్రేషన్‌పై డీఏవోలు, ఏఈవోలకు ఇంకా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో ఈసారి కొత్త రైతుల రిజిస్ట్రేషన్ ఉండకపోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. దీంతో లక్షల మంది కొత్త రైతులు పంట పెట్టుబడి సాయాన్ని కోల్పోయే అవకాశం ఉన్నది. ఇప్పటికే భూమిని అమ్మేసుకున్న పాత రైతును రైతుభరోసా జాబితా నుంచి తొలగిస్తారు. దీంతో ఆ రైతుకు పంట పెట్టుబడి సాయం లభించదు. ఆ రైతు నుంచి భూమిని కొనుగోలు చేసిన కొత్త రైతుకు రైతుభరోసాలో పేరు రిజిస్టర్ చేసుకునే అవకాశం ఇవ్వకపోతే ఆయనకూ సాయం అందదు. ఇలా పాత రైతులను జాబితా నుంచి తొలగించడం, కొత్త రైతులకు పెట్టుబడి సాయాన్ని ఇవ్వకపోవడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## అసెంబ్లీ సాక్షిగా దళిత మంత్రికి అవమానం!

- శాసనమండలిలోకి వెళ్లకుండా దామోదర రాజనర్సింహను అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది
- డిప్యూటీ సీఎం చాంబర్‌లోకి వెళ్ల నివ్వకుండా మందుల సామేలు, కవ్వంపల్లిని అడ్డుకున్న గన్‌మెన్లు
- వెనుదిరిగిన వైనం.. ఒకే వేదికపై గంటల వ్యవధిలో ఘటన
- నన్నే ఆపుతారా? అంటూ మంత్రి దామోదర సీరియస్

హైదరాబాద్, మార్చి 17: అసెంబ్లీ సాక్షిగా దళిత మంత్రి, ఎమ్మెల్యేలకు ఘోర అవమానం జరిగింది. దళిత మంత్రి దామోదర రాజనర్సింహను శాసనమండలి వద్ద సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోగా దళిత ఎమ్మెల్యేలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ వద్ద గన్‌మెన్లు అడ్డుకున్నారు. ఒకే వేదికపై గంటల వ్యవధిలోనే ఈ రెండు ఘటనలు జరుగడం చర్చనీయాంశమైంది. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహా ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ కలిసి శాసనమండలి కొత్త భవనంలోకి వెళ్తుండగా, అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది అడ్డు చెప్పి.. ఇది సీఎం వెళ్లే దారి అని, మరోవైపు నుంచి వెళ్లాలని మంత్రికి సూచించారు. ఊహించని ఈ పరిణామంతో ఆగ్రహం వ్యక్తం చేసిన దామోదర నర్సింహ.. 'మంత్రిని నన్నే అడ్డుకుంటరా? మీకు రూల్స్ తెలుసా?..ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టను' అని వారిని హెచ్చరించారు. ఆ తర్వాత అదే దారి నుంచి లోపలికి వెళ్లారు. ఇదిలా ఉంటే మరోవైపు డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్కనుకలిసేందుకు ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ కలిసి చాంబర్ వద్దకు వచ్చి లోపలికి వెళ్తుండగా భట్టి గన్‌మె న్లు అనుమతించలేదు. కొద్దిసేపు అక్కడే వేచిచూసినా ససే మిరా అనడంతో చేసేదేమీ లేక తీవ్ర అసంతృప్తితో వెనుదిరి గారు. సీఎం చాంబర్ వద్ద కూడా ఇలాంటి ఆంక్షలు ఉండవం టూ ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా ఒకేరోజు దళిత మంత్రికి, ఎమ్మెల్యేలకు అవమానం జరుగడం తీవ్ర చర్చకు దారి తీసింది.

## పదవ తరగతి పరీక్షల్లో పాము కలకలం..

### పరుగులు తీసిన విద్యార్థులు



అమరావతి, మార్చి 17: ఏపీలో సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ( ౹వత్ష్ర జుఇఖఎం ) ప్రారంభ మయ్యాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగనున్నాయి. 18న సెకండ్ లాంగ్వేజ్, 23న మ్యాథ్స్, 25న ఫిజిక్స్, 28న బయోలాజికల్ సైన్స్, 30 సోషల్ స్టడీస్, 31న సెకండ్ లాంగ్వేజ్ పేపర్2 , ఏప్రిల్ 1న ఆపన్షల్ సబెక్ట్ పరీక్షలు జరుగుతాయని ఉన్నత విద్యా శాఖ అధికారులు వెల్లడించారు. కాగా సోమ వారం కడప జిల్లా బి.కోడూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి పాము (౹ాఖుఎవ) రావడం కలకలం రేపింది. పామును చూసిన విద్యార్థులు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. అక్కడిసిబ్బంది పామును చంపి బయట పడేయతంతో విద్యార్థులు, పరీక్షల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

balagamtv100@gmail.com

## నా వాచ్ ధర నలభై వేలే..
## కోటి వాచ్ ధరించినట్టు ట్రోలింగ్



● క్లారిటీ ఇచ్చిన ఆది శ్రీనివాస్

హైదరాబాద్,మార్చి 17: తాను ధరించిన వాచ్ ధర రూ.10-40 వేలు మాత్రమే అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ క్లారిటీ ఇచ్చారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. తన వాచ్ ధరపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రూ.కోటి ఖరీదైన రోలెక్స్ వాచ్ ధరించి అసెంబ్లీకి వచ్చినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ధరించిన వాచ్ మైకేల్ కోర్సు బ్రాండ్‌కు చెందినది అని స్పష్టం చేశారు. దీని ధర ఆన్‌లైన్‌లో రూ.10-40 వేలుగా చూయిస్తుందని తెలిపారు.

## గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మాకెందుకు?..
### మా భూములే మాకు కావాలి.. మర్లకుంట తండాలో రైతుల రిలే దీక్షలు



హైదరాబాద్,మార్చి 17: గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం తమ భూములు గుంజుకుంటే ఊరుకునేది లేదని బాధిత రైతులు హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ కోసం నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం తమను బలి చేస్తారా? అని యాచారం మండలం మర్లకుంట తండా రైతులు ప్రశ్నిస్తున్నారు. 'గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మాకొద్దు.. మా భూములే మాకు ముద్దు' అంటూ మంగళవారం వారు మర్లకుంట తండాలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ భూములు కోల్పోతున్న అనేక గ్రామాల రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. మరికొందరు కోర్టులను సైతం ఆశ్రయించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ భూములిచ్చేది లేదని గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు పరిధిలోకి వచ్చే మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు చెందిన రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.ఓవైపు రైతులు ఆందోళన చేపడుతుండగానే.. మరోవైపు ప్రభుత్వం అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులను ప్రారంభించింది. తమ భూముల నుంచి బలవంతంగా రోడ్లు వేస్తే సహించేది లేదని హెచ్చరిస్తూ తమ పొలాల వద్దనే కాపు కాస్తున్నారు. ఇప్పటికే కుర్మిద్ద అనుబంధ గ్రామాలైన మర్లకుంటతండా, ముచ్చర్లకుంటతండాతోపాటు సాయిబండా తండాలకు చెందిన రైతులు అధికారులు నిర్వహించే సర్వేను అడ్డుకున్నారు. రైతులకు మద్దతుగా వివిధ రాజకీయపార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు ముందుకొస్తున్నారు. దీంతో ఫ్యూచర్‌సిటీ కోసం వేసే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు అడుగడుగునా అడ్డంకులు తగులుతున్నాయి.. దీక్షలో కూర్చున్న సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు.అలాంటప్పుడు తమ భూములు ఇచ్చేది లేదని స్పష్టంచేస్తున్నారు. ఇప్పటికే తాము ఫార్మాసిటీ కోసం భూములిచ్చినట్టు చెప్పారు. పట్టా భూములు మాత్రం ఇచ్చేది లేదని చెప్తున్నా ప్రభుత్వం పట్టా భూములను టీజీఐఐసీ పేరుమీద బదలాయించి నిషేధిత జాబితాలో చేర్చినట్టు వారు మండిపడ్డారు. తమకు తెలియకుండానే తమ పరిహారాన్ని అథారిటీలో జమచేశారంటూ ధ్వజమెత్తారు. తమకున్న కొద్దిపాటి భూమిని తీసుకోవద్దని, భూములు లేకపోతే తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిలే దీక్షలో లంబాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంపాల్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్‌నాయక్, ప్రజాసంఘం నాయకుడు పృథ్వీరాజ్, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ నాయక్, శ్రీకాంత్‌నాయక్, రాజునాయక్, ఉపసర్పంచ్ రవీందర్, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సలసల.. అసలు, వలస కాంగ్రెస్ నేతల మధ్య ముదిరిన లొల్లి



హైదరాబాద్,మార్చి 17: కాంగ్రెస్‌లో అసలు, వలస నేతల మధ్య ఆధిపత్యపోరు పతాకస్థాయికి చేరింది. అధికారంలోకి వచ్చింది మొదలు వలస నేతలు ప్రభుత్వంపై పట్టు సాధించారని, అటు పార్టీ పదవుల్లో, ఇటు ప్రభుత్వపరమైన పదవుల్లోనూ వారికే ప్రాధాన్యం లభిస్తున్నదని, అసలు కాంగ్రెస్ నేతలను ఇబ్బందులు పెడుతున్నారన్న వాదనలు ఉన్నాయి. డీసీసీ అధ్యక్షుల నుంచి మొదలు ఇటీవల జరిగిన రాజ్యసభ వరకు వలస కాంగ్రెస్ నేతలకే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. టీపీసీసీ పూర్తిగా ముఖ్యనేత చేతిలో కీలుబొమ్మగా మారిందని, పదవులు ఏవైనా ఆయన వర్గంతయారు చేసిన జాబితా మీద రబ్బర్ స్టాంపు వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ పరిణామాలపై సీనియర్లు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారనేది బహిరంగ రహస్యమే. దీంతో ఇందులో భాగంగానే కొందరు నేతలు తరచూ ధికారస్వరం వినిపిస్తున్నారని, కొంతమందిఎమ్మెల్యేలు, మంత్రులుకూడా ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగ విమర్శలు చేస్తున్నారని చెప్తున్నారు.ఈ నేపథ్యంలో ఢిల్లీ దూత అసలు కాంగ్రెస్ నేతలతో చర్చించి, వారి అభిప్రాయాలను ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయం చేయకుంటే భవిష్యత్తు ఆందోళనకరంగా ఉంటుందని హెచ్చరించినట్టు సమాచారం. సీనియర్‌నాయకులను, ప్రభుత్వాన్ని సమన్వయం చేసేందుకు తక్షణమే కమిటీ ఏర్పాటుచేయాలని, ఇందులో సీనియర్ కాంగ్రెస్ నేతలను మాత్రమే సభ్యులుగా నియమించాలని ఏఐసీసీకి స్పష్టం చేసినట్టు చెప్తున్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను ఢిల్లీ పెద్దలు పక్కన పెట్టినట్టు తెలిసింది. కేరళ ఎన్నికల వ్యవహారాల్లో తెలంగాణ సహకారమే ఎక్కువ అవసరమని, ఈ పరిస్థితిలో అసలు కాంగ్రెస్ నేతలకు ప్రాముఖ్యత ఇచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే ఇబ్బందులు పడతామని వారించినట్టు ప్రచారం జరుగుతున్నది. అగ్రనేత సైతం అసెంబ్లీఎన్నికలు ముగిసిన తర్వా తే కమిటీ గురించి ఆలోచిద్దామని స్పష్టం చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# అసెంబ్లీ ముట్టడికి అంగన్‌వాడీల యత్నం

### సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
### అడ్డుకున్న పోలీసులు.. టీచర్ల అరెస్టు



హైదరాబాద్, మార్చి 16: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. అసెంబ్లీ ముట్టడికి యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విడతల వారీగా ఇందిరాపార్కులోని ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి వారు అసెంబ్లీని ముట్టడించేందుకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌కు పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. కొద్దిసేపు ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఐసీడీఎస్ పథకానికి సరిపోయినన్ని నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించి ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం ఒంటిపూట బడులను అమలు చేయాలని అన్నారు. ప్రైమరీ విద్యను అంగన్‌వాడీలలో నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ వర్కర్ల కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్స్‌కు ఈ విధానాన్ని అమలు చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. మే ఒకటో తేదీ నుంచి 31 వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఒకేసారి సెలవులను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, పద్మశ్రీ, కార్యదర్శులు జే వెంకటేశ్, సుధాకర్, శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సునిత, పద్మ తదతరులు పాల్గొన్నారు.

## నిత్యావసరాల ధరలను నియంత్రించాలి



● సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఖాళీ సిలిండర్లతో నిరసన
● పాల్వంచ పట్టణంలో అమెరికా అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం

పాల్వంచ, మార్చి 16 : ఇరాన్‌పై అమెరికా యుద్ధం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరలను కేంద్రం తక్షణమే నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కొత్తగూడెం బస్టాండ్ వద్ద సోమవారం మానవహారం చేపట్టి, ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎండీ సాబీర్‌పాషా మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా కేంద్రం మౌనం వహించడం శోచనీయమన్నారు. పాల్వంచ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ.. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## గ్యాస్ ధరలు తగ్గించాలంటూ నిరసన




● బంక్‌ల బ్లాక్ దందాపై చర్యలు తీసుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్

హైదరాబాద్, మార్చి 16: బంక్ నిర్వాహకులు కృత్రిమ ఇంధన కొరత సృష్టించడంలో భాగంగానే ఎల్పీజీ, సీఎన్జీ బంక్‌ల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారని ఆటో డ్రైవర్ల యూనియన్ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడ చౌరస్తాలో నిరసన చేపట్టారు. బ్యానర్లతో ర్యాలీ తీశారు. అనంతరం ఆటో జేఏసీ నాయకులు సత్తిరెడ్డి, వెంకటేశ్ మాట్లాడుతూ.. బంక్‌ల కృత్రిమ కొరతపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా రూ.30 నుంచి రూ.40 పెంచడంపై ఆవేదన వ్యక్తంచేశారు. నిరసనలో నిరంజన్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.


## గోదాములో 300 సిలిండర్లు మాయం



● అచ్చంపేట తహసీల్దార్ సైదులు తనిఖీలో వెలుగులోకి ఘటన

అచ్చంపేట రూరల్, మార్చి 16 : గోదాములో ఉండాల్సిన 300 నిండు గ్యాస్ సిలిండర్లు మాయమైన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. గ్యాస్ ట్రబుల్ ఉన్న సమయంలో ఇన్ని సిలిండర్లను నిర్వాహకులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అచ్చంపేట పట్టణంలోని లక్ష్మీప్రసన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదామును సోమవారం తహసీల్దార్ సైదులు తనిఖీ చేశారు. గోదాంలో ఉండాల్సిన 300 నిండు సిలిండర్ల అక్కడ లేవు. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయ రిజిస్టర్‌లో లెక్కలో తేడాను గుర్తించారు. నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగా బయటి మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారని తహసీల్దార్ వెల్లడించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

## అవినీతి అధికారిని పట్టించిన బినామీ!



● ఇద్దరి మధ్య గొడవతో వెలుగులోకి
● కరీంనగర్ జిల్లాలో ఘటన

హైదరాబాద్, మార్చి 16: అక్రమ ఆస్తుల కేసులో ఓ అవినీతి అధికారిని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారుల వివరాల ప్ర కారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ ఈగల మధుసూదన్ ఉద్యోగుల ఫైల్స్, కాంట్రాక్టర్ల బిల్లులు క్లియర్ చేయడానికి తన స్నేహితుడి పేరు మీద ఓ ప్రైవేట్ బ్యాంకులో అకౌంట్ తీశాడు. అతని అకౌంట్‌కు రూ.14.77 లక్షలు జమ చేయించాడు. ఇటీవల వీరి మధ్య విభేదాలు రాగా మధుసూదన్ అవి నీతి చిట్టాను స్నేహితుడు బయటపెట్టాడు. అక్ర మ సంపాదనను తన ఖాతాకు బదిలీ చేయించేవాడని ప్రూఫ్స్‌తో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో సూపరింటెండెంట్‌ను కార్యాలయంలో అరెస్టు చేసి కరీంనగర్ కోర్టుకు తరలించారు.

## కామారెడ్డి బల్దియాలో ఏసీబీ సోదాలు

కామారెడ్డి,మార్చి 16: కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. గత రెండేండ్లలో అనధికార నిర్మాణాలపై 47 ఫిర్యాదులు వచ్చాయ ని, 400కు పైగా వాణిజ్య దుకాణాలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్ పెండింగ్‌లో ఉన్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. ఇంధన చార్జీ ల కోసం మున్సిపల్ అధికారులు నెలకు రూ.12.40 లక్షల మొత్తాన్ని కేటాయించినా సరైన రికార్డులు నిర్వహించలేదని, కొంత మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధుల కు గైర్హాజరైనా పూర్తి నెల జీతాలు క్లెయిమ్ చేసినట్టు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వానికి రూ.కోటికిపైగా నష్టం వాటిల్లినట్టు తనిఖీల్లో వెలుగు చూసిందని పేర్కొన్నారు. అధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

## యాంటీ పైరసీ డిస్‌క్లైమర్ ప్రారంభం



హైదరాబాద్, మార్చి 16: పైరసీ భూతాన్ని అంతం చేసేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) నడుం బిగించింది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కీలక సమావేశంలో పైరసీ కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేకమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ), థియేటర్లలో ప్రదర్శించే నూతన యాంటీ-పైరసీ డిస్‌క్లైమర్‌ను సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్, తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు డీ సురేశ్‌బాబు ప్రారంభించారు. సినిమాల పైరసీని అడ్డుకోవడంలో లా ఎన్ ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ఫిల్మ్ ఎకోసిస్టమ్ మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని శిఖాగోయెల్ చెప్పారు. పైరసీతో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీకి ఏడాదికి రూ.3,700 కోట్ల నష్టం, భారతీయ సినిమా ఇండస్ట్రీకి రూ.22,400 కోట్లకు పైగా నష్టం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు. ఎస్‌వోపీలో కాపీరైట్ యాక్ట్, సినిమాటోగ్రాఫ్ యాక్ట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదు ఉంటుంది.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- రైతులు ముందుకు రావాలి..
- 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మెగా ప్లాంటేషన్ ప్రారంభం
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద ఇల్లంతకుంట మండలం వంతడుపుల, అనంతారం, రేపాక, ఓబులాపూర్, బోయినపల్లి మండలం విలాసాగర్, మల్కాపూర్, మర్లపేట, కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్, వేములవాడ, గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామాల్లో మొత్తం 40 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక దిగుబడితో పాటు మంచి లాభాలు వస్తాయని తెలిపారు. ఈ పంటలో అంతర పంటలుగా కూరగాయలు, మొక్కజొన్న, పూల మొక్కలు వంటి పంటలను కూడా సాగు చేయవచ్చని పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సహా పలు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని, పంటకు మంచి మద్దతు ధర లభిస్తుందని అన్నారు. పంట ఉత్పత్తి సేకరణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ప్రతి మండలం నుంచి కొనుగోలు చేస్తారని అన్నారు . ఒకే పంటపై ఆధారపడకుండా ఆయిల్ పామ్ సాగును పెంచాలని ఉద్దేశంతో ఇప్పటికే పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అవగాహన కల్పించామని,వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు లక్ష్యాలు కూడా నిర్దేశించినట్లు తెలిపారు .ఆదర్శ రైతులు ముందుకు వస్తున్నారని, మిగతా రైతులు కూడా ఈ పంట సాగులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాకు సమీపంలో ఉన్న సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న బోనాలలో కోతుల బెడదపై వినూత్న చర్యలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు చిన్న బోనాలలో గత కొన్ని నెలలుగా కోతుల బెడద తీవ్రంగా పెరిగి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. కోతులు ఇళ్లపైకి ఎక్కి ఆహార పదార్థాలు తీసుకెళ్లడం చిన్నపిల్లలను వృద్ధులను భయపెడుతూ వారిపై దాడి చేయడం గృహాలపై ఉన్న సామగ్రిని ధ్వంసం చేయడం వంటి సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్నాయని ముఖ్యంగా మహిళలు, వృద్ధులు చిన్నపిల్లలు ఈ సమస్య వల్ల భయాందోళనలకు గురవుతున్నారని గమనించిన 10వ వార్డు గౌరవ కౌన్సిలర్ బోల్గం వైష్ణవి నాగరాజ్ గౌడ్ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకొని కోతుల బెడదను తగ్గించడానికి సాధారణ పద్ధతులు సరిపోవని గుర్తించిన ఆయన, వినూత్నమైన తక్షణ ఫలితాలను ఇచ్చే విధంగా ప్రత్యేకంగా ఒక ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా కోతులను భయపెట్టడానికి ఆ ప్రాంతం నుండి తరిమివేయడానికి గొరిల్లా, చింపాంజీ వేషాలు ధరించిన వ్యక్తులను ఏర్పాటు చేసి వార్డు పరిధిలోని ప్రధాన వీధులు, కాలనీలు కోతులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. ఈ విధానం ద్వారా కోతులు భయపడి ఆ ప్రాంతం నుండి బయటకు వెళ్లేలా చేయడం జరిగింది. ఈ వినూత్న చర్య వల్ల కోతుల సంచారం తగ్గి ప్రజలు ఉపశమనం కలిగింది.

ఈ సందర్భంగా కౌన్సిలర్ బోల్గం వైష్ణవి నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించడం తన ప్రాధాన్యత అని తెలిపారు. పదవ వార్డు ప్రాంతంలో కోతుల బెడద వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చిన వెంటనే వాటిని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకున్నామని చెప్పారు. కోతుల సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా సిరిసిల్ల మున్సిపాలిటీ అధికారులతో కూడా సంప్రదించి కోతుల నియంత్రణ కోసం మరిన్ని శాశ్వత చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. అవసరమైతే అటవీ శాఖ సహకారంతో కోతులను పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టే చర్యలు కూడా తీసుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా కౌన్సిలర్ తీసుకున్న ఈ వినూత్న చర్యలను ప్రశంసిస్తూ తమ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వెంటనే స్పందించడం మంచి నాయకత్వ లక్షణమని వారు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రతి సమస్యకు సమయానికి స్పందిస్తూ సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

# వేములవాడలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, వేములవాడ:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయం లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వేములవాడ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, వేద పండితులు పాల్గొన్నారు.



# ఉగాది కవి సమ్మేళనంలో భాగంగా యువ కవికి చిరు సత్కారం..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్ హనుమాన్ దేవస్థానంలో సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమితి గౌరవ అధ్యక్షులు పోరండ్ల మురళీధర్, అధ్యక్షులు జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నేరోజు రమేష్ మరియు మానేరు స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు చింతోజు భాస్కర్ నాయకత్వం వహించారు. ఈ వేడుకకు సిరిసిల్ల పట్టణ మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా, డి.ఎస్.పి కట్రోజు నాగేంద్ర చారి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహించడంతో పాటు ప్రతిభ కనబరిచిన కవులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి నాగేంద్ర చారి మాట్లాడుతూ.. "కలం పట్టిన కవులు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ఒక సైనికుడిలా ఎదుర్కొంటూ, నిద్రలో ఉన్న సమాజాన్ని మేల్కొలిపే శక్తి కలవారు" అంతేకాకుండా ఇలాంటి యువకులు ముందుకు వచ్చి సమాజానికి సాహిత్యంతో రూపుమాపాలని అన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ.. యువ కవి, రచయిత అంకారపు రవి ని సత్కరించడం చాలా ఆనందంగా ఉందని, ఇలాంటి యువ రచయితలను ప్రతిభలను ప్రోత్సహించడం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొని అభినందనలు తెలిపారు.



# సిరిసిల్ల మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా ఆడెపు చంద్రకళ నియామకం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్లో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా ఆడెపు చంద్రకళ ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నియామక పత్రాన్ని 23వ వార్డ్ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళకు అందజేశారు.

ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. అనంతరం ఆడెపు చంద్రకళ మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్ పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో భాగమవుతూ, కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా ఆర్టీఏ సభ్యులు సంగీతం శ్రీనాథ్, 14వ వార్డు కౌన్సిలర్ వెంగళ లీల లక్ష్మీనర్సు, 22వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి గంగరాజు, 32వ వార్డు కౌన్సిలర్ కూరపాటి శ్రీశైలం, 4 వ వార్డు కౌన్సిలర్ లయక్ సుల్తానా, జిల్ల ఎస్సీ సెల్ నాయకులు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్ ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ కలెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ దళిత మహిళల ఫిర్యాదు..

- హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

**బలగం టీవీ, జనగామ:**

జనగామలో ఇద్దరు దళిత మహిళలు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో ఆర్డీవో వసంత, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి మరియు ఇతర రెవెన్యూ అధికారుల పేర్లు కూడా చేర్చినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు సీఐ సత్యనారాయణ రెడ్డికి వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు.

సుమారు ఆరు నెలల క్రితం, అప్పటి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇద్దరు మహిళలకు చెరో రూ.3 లక్షల రుణాలు మంజూరు చేశారు. ఆ రుణాలతో ఒక మహిళ టీ స్టాల్ ఏర్పాటు చేసుకోగా, మరో మహిళ విజయ డైరీ ఉత్పత్తులు విక్రయించే డబ్బా ఏర్పాటు చేసుకుని కలెక్టర్ కార్యాలయం ముందు ఉపాధి పొందుతున్నారు. అప్పటి నుంచి వారు క్రమం తప్పకుండా లోన్ చెల్లింపులు చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే గత వారం రోజులుగా ప్రస్తుత కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కార్యాలయం ముందు ఉన్న తమ డబ్బాలను తొలగించాలని అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారని బాధిత మహిళలు ఆరోపించారు. వారం రోజుల క్రితం జేసీబీలు, డోజర్లతో డబ్బాలను తొలగించే ప్రయత్నం చేయగా మహిళలు అడ్డుకుని నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

ఎంత మొర పెట్టుకున్నా తమ సమస్యను పరిష్కరించకపోవడంతో కలెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అలాగే తమకు న్యాయం చేయాలని కోరుతూ హైకోర్టును కూడా ఆశ్రయించి పిల్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించినప్పటికీ, ఉపాధి కల్పించి ఆరు నెలలు గడవకముందే తమను వీధిలో పడేస్తున్నారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బాలపై లాభం వచ్చినా రాకపోయినా కష్టపడి ప్రతి నెలా లోన్ చెల్లిస్తున్నామని, ఇప్పుడు డబ్బాలను తొలగిస్తే మిగిలిన లోన్ ఎలా చెల్లించాలంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు.



జగిత్యాలలో దారుణం..

# గర్భిణి భార్యను కత్తితో హత్య చేసిన భర్త

**బలగం టీవి, కోరుట్ల**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్‌కు చెందిన వైష్ణవి ఎనిమిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెద్దలు పెళ్లికి అంగీకరించకపోవడంతో మాదాపూర్‌లో వేరుగా నివసిస్తున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తుండగా, వైష్ణవి యూట్యూబ్‌లో రీల్స్ చేస్తూ ఛానల్ నిర్వహిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో హరిబాబు కత్తితో వైష్ణవిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం పక్కింటివారు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.



# రెసిడెన్షియల్ విద్యాలయాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- హాస్టళ్లలో వసతులు, భోజన నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాల పక్కాగా నిర్వహణకు అలాగే వసతులు పరిశీలించేందుకు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తినేందుకు ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నియమించారు. జిల్లాలోని ఆయా మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ చేస్తూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని, ఆయా హాస్టల్లో కనీస వసతులు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక అధికారులుగా వివిధ శాఖల అధికారులను నియమించారు. సోమవారం నుంచి మొదలు ఆదివారం వరకు ఒక్కో అధికారి ఒక్కో రోజున తమకు కేటాయించిన రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి దాన్ని నాణ్యతను, కనీస వసతులు పరిశీలించనున్నారు.






# భూభారతి రీ సర్వేకు ప్రజల సహకారం అవసరం

- అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత
- రైతులు రీ సర్వేలో భాగస్వాములు కావాలి
- సర్వే అనంతరం భూదార్ కార్డులు జారీ

**బలగం టీవి, రాయికల్**

మండలంలోని దావన్‌పల్లి గ్రామంలో భూభారతి-2025 భూ సర్వే కార్యక్రమంలో భాగంగా రీ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత హాజరై మాట్లాడుతూ.. గ్రామంలో కొత్తగా భూ సమస్యలు తలెత్తకుండా ఉండటంతో పాటు, పాత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేందుకు రీ సర్వే కీలకమని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ సర్వేలో భాగస్వాములు కావాలని సూచించారు. సర్వే అనంతరం భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో సర్వే నిర్వహించి భూముల సరిహద్దులను ఖచ్చితంగా నమోదు చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్,తహసీల్దార్ నాగార్జున, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కిషన్ ప్రసాద్,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే విఠల్ రావు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య,మండల సర్వే అధికారి నరేందర్,గ్రామ సర్పంచ్ ప్రసాద్,జీపీఓలు లావణ్య,స్వప్న పాల్గొన్నారు.



# పెద్దూరు పాఠశాలలో ఘనంగా ఉగాది వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని విద్యార్థులందరికీ అందించారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు లాగానే మన జీవితంలో కూడా కష్టనష్టాలు, సుఖశాంతులు, అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. కొత్త సంవత్సరం ఉగాది తోనే ప్రారంభమవుతుందని, వసంత ఋతువుల విద్యార్థులందరి జీవితాలు చిగురించాలని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి ,లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు, రవికుమార్, గడ్డి మహేశ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎంపీహెచ్ఎస్ పెద్దూర్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పెద్దూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథులుగా 8వ వార్డ్ కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి మరియు 9వ వార్డ్ కౌన్సిలర్ దొంతినేని కళ్యాణి హాజరై వారు మాట్లాడుతూ.. "విద్యార్థి జీవితంలో పదవ తరగతి అనేది ఒక కీలకమైన మలుపు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. ఇక్కడ నేర్చుకున్న విలువలు మీ భవిష్యత్తుకు పునాది కావాలి" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒత్తిడిని ఎలా అధిగమించాలో సూచించారు. అనంతరం విద్యార్థులు తమ పాఠశాల జ్ఞాపకాలను పంచుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చివరగా, విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని పంపిణీ చేసి, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయ బృందం దీవించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఎంపీసీ చైర్పర్సన్ తిప్పవరం సుధ, వార్డ్ కౌన్సిలర్స్ లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, దొంతనేని కళ్యాణి అశోక్ రావ్, ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, లకావత్ ఉమా, జై రాజమల్లు, రవికుమార్, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

● దంపతులు దుర్మరణం



**బలగం టీవి, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దంపతులు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాలకు చెందిన లయన్స్ క్లబ్, క్రెడాయ్ సభ్యుడు ఎడ్ల శ్రీనివాస్, ఆయన భార్య రజిత దంపతుల కుమార్తె రిషిత హైదరాబాద్‌లో చదువుకుంటోంది. కూతుర్ని చూసేందుకు హైదరాబాద్ వెళ్లిన దంపతులు సోమవారం రాత్రి మంచిర్యాలకు తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ సమీపానికి చేరుకున్న సమయంలో వారి కారు అదుపుతప్పి కల్వర్ట్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాస్, రజిత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



# కందికట్కూర్‌లో మద్యం అమ్మకం నిషేధం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కందికట్కూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ విజయమ్మ అధ్యక్షతన పాలక మండలి ఆధ్వర్యంలో మంగళవారం రోజున గ్రామసభ నిర్వహించారు. ఇట్టి గ్రామసభలో పాలక మండలి గ్రామ ప్రజలు కలిసి గ్రామ అభివృద్ధి కొరకు పలు అంశాలపై చర్చించి గ్రామంలో మద్యం షాపులు బందుచేయాలని. అలాగే గుట్కా కి సంబంధించిన వాటిని కూడా అమ్మరదని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయమ్మ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు రావు ఉప సర్పంచ్ అజయ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రంలో అనంతగిరి గ్రామం..

● సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం, నేరాల నియంత్రణ లో కీలకం

● రాజన్న సిరిసిల్ల డీఎస్పి కత్రోజు నాగేంద్ర చారి



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి గ్రామం సీసీ కెమెరాల ఏర్పాటు తో నిఘా నేత్రం లో ఉండడంతో నేరాల నియంత్రణ తో పాటు, పాలు కీలక సమస్యల పరిష్కరణ లో కీలక పాత్ర పోషిస్తాయని, సీసీ కెమెరా ల ఏర్పాటు అభినందనీయమని రాజన్న సిరిసిల్ల డిఎస్ పి నాగేంద్ర చారి పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి గ్రామంలో 17 సీసీటీవీ కెమెరాలను సిరిసిల్ల డి.ఎస్.పి కత్రోజు నాగేంద్ర చారి, గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీటీవీ కెమెరాలను గ్రామం మొత్తం కవర్ అయ్యే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో డీఎస్పీ చేతుల మీదుగా సీసీ కెమెరాలు ప్రారంభించడం పట్ల సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్,విపిఓ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ వార్డు మెంబర్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారు..?

● మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

● పార్టీ మార్పుపై సంకేతాలులిలి



**బలగం టీవి, జగిత్యాల**

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేస్తూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ అసలు ఏ పార్టీలో ఉన్నారో తెలియడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో ఉన్నానని చెబుతున్న ఆయన తాను కలిసి పని చేయాలని ఎలా కోరుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాజాగా మీడియాతో మాట్లాడిన జీవన్‌రెడ్డి నాలుగు దశాబ్దాల రాజకీయ బంధాన్ని విడిచిపెట్టుకోవడం ఎవరికైనా కష్టమేనని, ప్రస్తుతం తాను ఆ బాధలో ఉన్నానని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పని చేయడంలో తప్పు లేదని, అయితే కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక వంటి విషయాల్లో ఎమ్మెల్యే పాత్ర సమంజసం కాదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో ఎదురవుతున్న పరిణామాలపై తాను ఆవేదన వ్యక్తం చేసినట్లు చెప్పారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా జగిత్యాల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అదే వ్యక్తి కలిసి పని చేయాలని కోరడం విచిత్రమని విమర్శించారు.

నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించిన జీవన్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటికీ తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఉండాలనే కోరిక కూడా ఉందని తెలిపారు. అయితే తనపై ఒత్తిళ్లు కొనసాగితే పార్టీ మార్పు తప్పదని సంకేతాలు ఇచ్చారు. తాను పార్టీ మారితే దానికి ఎమ్మెల్యే సంజయ్, ఆయన వెనుక ఉన్న నాయకులే కారణమవుతారని పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంట్లో ఉడుము వచ్చినట్లుగా సంజయ్ తన ఇంట్లోకి వచ్చాడని, అలాంటి పరిస్థితుల్లో ఎలా కలిసి పని చేయగలనని వ్యాఖ్యానించారు. స్పీకర్ కూడా సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరైంది కాదన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశానని, ప్రతి ఎన్నికల్లో విజయాలు సాధించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఐక్యతకు జగిత్యాల ఒక నిదర్శనమని స్పష్టం చేశారు. తాను ఎక్కడ ఉన్నా ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తానని, సంజయ్ కుమార్ గత ఎనిమిది నెలల్లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రహదారి విస్తరణ, ఆక్రమణల తొలగింపు వంటి అంశాలపై స్పష్టత లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఐక్యతను ఎమ్మెల్యే సంజయ్ భంగం చేశారని ఆరోపించారు.తాను ఇప్పటికీ కాంగ్రెస్‌లోనే ఉన్నానని, కానీ పార్టీ మారే పరిస్థితి వస్తే దానికి సంజయ్‌తో పాటు పార్టీ అధిష్టానమే కారణమవుతుందని అన్నారు. మేనిఫెస్టో హామీల అమలులో జాప్యం జరుగుతోందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

ఉగాది తర్వాత కాంగ్రెస్ పార్టీకి రాజీనామాపై ఆలోచిస్తానని స్పష్టం చేసిన జీవన్‌రెడ్డి, ఆత్మగౌరవం దెబ్బతింటే పార్టీలో ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పే పరిస్థితి రావచ్చని సంకేతాలు ఇచ్చారు.

# తడి-పొడి చెత్త వేరు చేయడం ద్వారా పరిశుభ్రంగా పట్టణాలు..

● కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల సహకారం లేకుండా పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యం కాదని, ప్రతి ఇంటి వద్ద నుంచే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.మంగళవారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వేములవాడ మండలం తెట్టెకుంట శివారులోని మున్సిపాలిటీకి చెందిన పొడి వనరుల సేకరణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన యంత్రాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కింద మార్చి 6 నుంచి పట్టణాలు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్త సేకరణ, నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు ఆధునిక పద్ధతులను అమలు చేస్తున్నామని అన్నారు .వేములవాడ మున్సిపాలిటీలో ఇప్పటికే ఉన్న పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని మరింత బలోపేతం చేస్తూ, నూతన యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ యంత్రాల ద్వారా చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి కంపోస్ట్ తయారు చేయవచ్చని అన్నారు. ఇంటింటికీ తిరిగే మున్సిపల్ వాహనాల ద్వారా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేకరిస్తున్నామని, సేకరించిన పొడి చెత్తను కేంద్రానికి తీసుకువచ్చి యంత్రాల సహాయంతో ప్రాసెస్ చేస్తున్నామని, దీని వల్ల చెత్త నిర్వహణ మెరుగుపడి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని అన్నారు.

ప్రజలు తమ ఇళ్లలోనే చెత్తను వేరు చేసి ఇవ్వాలని,చెత్తను వేరు చేయడం వల్ల రీసైక్లింగ్ సులభమవుతుందని, డంపింగ్ యార్డుల్లో సమస్యలు తగ్గుతాయని తెలిపారు. అలాగే మున్సిపల్ వాహనాల్లో కూడా తడి, పొడి చెత్తను వేర్వేరు భాగాల్లో సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.డీఆర్‌సీసీ కేంద్రంలో బేలింగ్ మెషిన్, వెయిమెంట్ మెషిన్ ఏర్పాటు చేసి, రోజుకు 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్వహణ జరుగుతుందని, అదనంగా కంపోస్ట్ కేంద్రం కూడా అదే సామర్థ్యంతో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వార్డు సభ్యులు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, ఎల్ల శ్రీనివాస్, తోట రాజు, కాషా శ్రీనివాస్, మూడపల్లి నీలమ్మ, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమాఖ్య భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

● కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామ సమాఖ్య భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెట్టారో ఆరా తీశారు. కావలసిన కార్మికులు, సామగ్రి సిద్ధం చేసుకోవాలని, భవన నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. మండలంలో మంజూరు అయిన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణాలు సైతం నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. జన గణనలో భాగంగా ఇండ్ల గణనకు చేస్తున్న ప్రక్రియపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# దాడులు తక్షణమే ఆపాలి : ఇరాన్‌కు ఖతార్ గట్టి హెచ్చరిక



**బలగం టీవీ, ఖతార్:**

పౌర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని ఖతార్ ప్రభుత్వం ఇరాన్‌కు కఠిన హెచ్చరిక జారీ చేసింది. ప్రస్తుత ప్రాంతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఖతార్ స్పష్టమైన వైఖరిని ప్రకటించింది.

ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రతిపాదించిన "జాయింట్ కమిటీ" ఏర్పాటు ఆలోచనను ఖతార్ స్పష్టంగా తిరస్కరించింది. దాడుల వెనుక అమెరికా ప్రయోజనాలున్నాయా అనే అంశంపై దర్యాప్తు చేయాలని ఇరాన్ సూచించినప్పటికీ, ఖతార్ దీనిని అంగీకరించలేదు. "ఇది చాలా సరళమైన విషయం. ముందుగా దాడులు ఆపాలి. ఇందుకు కమిటీలు అవసరం లేదు" అని ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మజేద్ అల్-అన్సారీ స్పష్టం చేశారు. ఇక అరబ్ దేశాలపై జరుగుతున్న దాడులకు తాము కారణం కాదని ఇరాన్ వాదిస్తోంది. తమ 'షాహెద్' డ్రోన్‌ను పోలి ఉండే 'లూకాస్' అనే డ్రోన్‌ను అమెరికా తయారు చేసి అరబ్ దేశాలపై దాడులకు ఉపయోగిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇజ్రాయెల్ మరియు అమెరికా అరబ్ దేశాలతో తమ సంబంధాలను దెబ్బతీయడానికే పౌర స్థావరాలపై దాడులు చేస్తున్నాయని అరాగ్చీ వ్యాఖ్యానించారు.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అయితే ఖతార్ ప్రకారం, మెసయీద్ విద్యుత్ కేంద్రంలోని వాటర్ ట్యాంక్ మరియు రాస్ లాఫన్ ఇండస్ట్రియల్ సిటీలోని ఖతార్ ఎనర్జీ సదుపాయాలపై ఇరాన్ దళాలు డ్రోన్ దాడులు జరిపినట్లు వెల్లడించింది. దాడులు ప్రతిరోజూ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. వీకెండ్ సమయంలో పౌరులు మరియు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చిందని ఖతార్ అధికారులు తెలిపారు. ఆదివారం ఐదు డ్రోన్లను, సోమవారం రెండు విడతలుగా జరిగిన దాడులను ఖతార్ సాయుధ దళాలు గాల్లోనే కూల్చివేసినట్లు వెల్లడించారు.

"మా ప్రధాన లక్ష్యం మా దేశాన్ని మరియు ప్రజలను రక్షించడం. దాడులు పూర్తిగా ఆగిన తరువాతే దౌత్యపరమైన చర్చలకు అవకాశం ఉంటుంది. దాడులు కొనసాగుతున్న సమయంలో కమిటీలు ఏర్పాటు చేసే పరిస్థితి లేదు" అని ఖతార్ ప్రభుత్వం తేల్చి చెప్పింది.

# కూకట్‌పల్లిలో హవాలా నగదు కోటి దోపిడి

● 24 గంటల్లో దొంగల ముఠా అరెస్టు

● చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు

**బలగం టీవి, హైదరాబాద్**

కూకట్‌పల్లిలో భారీ దోపిడీ జరిగింది. రూ.కోటి హవాలా నగదు తీసుకెళ్తున్న వ్యక్తి కండ్లలో కారం కొట్టి దుండగులు రూ. కోటి నగదుతో పరారయ్యారు. ఈ ఘటన సోమవారం రాత్రి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా కేసును 24 గంటల్లో పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి సహా నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.77.39 లక్షల నగదు, ఫ్లైట్ టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు కూకట్‌పల్లి జోన్ డీసీపీ రీతీరాజ్ వెల్లడించారు.

వివరాల్లోకెళ్తే.. బహదూర్‌పురాకు చెందిన ఖుస్రోద్దీన్ తన యజమాని పంపిన హవాలా నగదుపై కన్నేసి స్నేహితుడు ఒమర్ షరీఫ్ గ్యాంగ్‌తో కలిసి దోపిడీకి ప్రణాళిక రూపొందించాడు. సోమవారం రాత్రి అతను కోటి రూపాయల నగదు తీసుకుని వెళ్తుండగా ముందస్తు పథకం ప్రకారం నిందితులు వెంబడించారు. కూకట్‌పల్లి మెట్రో పిల్లర్ నంబర్ 836 వద్ద నిందితులు అతని కండ్లల్లో కారంపొడి చల్లి నగదు దోచుకుని పరారయ్యారు. అదే సమయంలో కూకట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో, సీసీటీఎన్ఎస్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి సీఐ సుబ్బారావుకు సమాచారం అందించాడు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని నిందితులు వదిలేసిన హోండా యాక్టివా ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు శంషాబాద్ విమానాశ్రయంలో ఉన్నట్టు గుర్తించి, వారు లక్నో పారిపోవడానికి ముందే అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ఒమర్ షరీఫ్, గౌస్ సద్దాం, హమీద్, ఖుస్రోద్దీన్ ఉన్నారు. పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం గాలిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. ఈ కేసులో బాధితుడిగా ప్లాన్ ప్రకారం వ్యవహరించిన ఖుస్రోద్దీన్‌నే ప్రధాన సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. డబ్బుల కోసం ఆశపడి ఇంత తతంగాన్ని నడిపించాడని పోలీసులు తెలిపారు ప్రస్తుతం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. 24 గంటల వ్యవధిలో కేసును చేదించిన కూకట్‌పల్లి, సీసీఎస్ పోలీసులను అభినందించారు.



# కరీంనగర్ జిల్లాలో గాలికుంటు టీకాలు వేగవంతం

● ఇప్పటివరకు 14,468 పశువులకు టీకాలు పూర్తి

**బలగం టీవి, కరీంనగర్**

కరీంనగర్ జిల్లాలో చేపట్టిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం కొనసాగుతోందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి తెలిపారు. జిల్లాలో లక్ష్యంగా పెట్టుకున్న 92,500 పశువుల్లో ఇప్పటివరకు 14,468 పశువులకు టీకాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మంగళవారం చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో నిర్వహించిన టీకా శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఏప్రిల్ 9 నాటికి టీకాల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు నోరు, చిగుళ్లు, కాళ్ల గోళ్ల మధ్య పొక్కులు ఏర్పడి తీవ్ర జ్వరం వస్తుందని, సొంగ కారడం, మేత మేయకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు.

సంకరజాతి పశువుల్లో ప్రాణనష్టం ఎక్కువగా ఉండే అవకాశముందని హెచ్చరించారు. గాలి, నీరు, మేత, పాల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మూడు నెలలు దాటిన లేగదూడలు సహా గేదెలు, ఆవులు, ఎద్దులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది పశువులకు టీకాలు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సత్యం, కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ఓగులాపూర్ గ్రామంలో ఇందుర్తి పశువైద్యాధికారి సాంబారావు కూడా టీకా శిబిరాన్ని పరిశీలించి సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు.

# ఆస్పత్రుల్లో రోగులకు మత్తుమందు ఇచ్చి బంగారం దోపిడీ.. దంపతులు అరెస్ట్

● 11 తులాల బంగారం, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

**బలగం టీవి, సికింద్రాబాద్**

ఆస్పత్రుల్లో రోగులకు మత్తుమందు ఇచ్చి బంగారు ఆభరణాలు దోచుకుంటున్న మహిళను, ఆమెకు సహకరించిన భర్తను సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మార్కెట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 11 తులాల బంగారు ఆభరణాలు, ఒక కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలానికి చెందిన గౌండ్ల శిరీష డీ-ఫార్మసీ చదువుతోంది. ఆమె భర్త ఎడులపల్లి సాయికుమార్ గౌడ్ వ్యాపారం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వైద్యురాలిగా నటిస్తూ డాక్టర్ ఆప్రాన్ ధరించి ఆస్పత్రుల్లోకి ప్రవేశించిన శిరీష తన వెంట తెచ్చుకున్న 'డయాజెపామ్' మత్తు ఇంజక్షన్‌ను రోగులకు ఇచ్చేది. వారు స్పృహ కోల్పోయిన తర్వాత వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యేది. మార్చి 11న సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రి, అలాగే చందానగర్‌లోని సిటిజన్ ఆస్పత్రిలో ఇదే విధంగా రోగులను మత్తులోకి నెట్టివేసి బంగారం చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు.



దొంగిలించిన సొమ్మును విలాసాలకు, షాపింగ్‌కు ఖర్చు చేస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



● మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**


జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇండ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో కానీ అక్కడేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్‌లో కుళ్లిన చికెన్ విక్రయం.. చికెన్ సెంటర్‌పై పోలీసుల దాడి

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కుళ్లిన చికెన్‌ను నిల్వ ఉంచి విక్రయిస్తున్న చికెన్ సెంటర్‌పై వారసిగూడ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ముషీరాబాద్ బాపూజీనగర్‌లోని 'ఏ-1 ఫ్రెష్ చికెన్ మార్ట్' యజమాని షేక్ షకీల్ అపరిశుభ్రమైన వాతావరణంలో ఫ్రోజన్ చికెన్‌ను నిల్వ ఉంచి స్థానిక ప్రజలకు, చిన్న వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీనిపై స్పందించిన వారసిగూడ సబ్‌ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్రరెడ్డి తన సిబ్బంది, స్వతంత్ర సాక్షులతో కలిసి మధ్యాహ్నం సమయంలో చికెన్ సెంటర్‌పై దాడి చేశారు. తనిఖీల్లో సుమారు 610 కిలోల చికెన్ అత్యంత అపరిశుభ్రమైన స్థితిలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మాంసం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లు తేలింది.ఆ ప్రదేశంలో ఎలుకలు, పిల్లుల సంచారం ఉండటంతో మాంసం కలుషితమై మానవ వినియోగానికి పనికిరాని స్థితిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. షాపు ట్రేడింగ్ లైసెన్స్ ఏడాది క్రితమే ముగిసినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం కొనసాగిస్తున్నట్లు విచారణలో బయటపడింది.సికింద్రాబాద్ జోన్ డీసీపీ కె. రక్షిత కృష్ణమూర్తి ఆదేశాల మేరకు చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్‌రెడ్డి పర్యవేక్షణలో వారసిగూడ ఇన్‌స్పెక్టర్ జి. రాజేందర్ గౌడ్, ఎస్ఐ రామచంద్రరెడ్డి సిబ్బందితో కలిసి ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 11 ఎకరాలను కాపాడిన హైడ్రా




**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన 11 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో వీటి విలువ రూ. 1650 కోట్లు ఉంటుందని అంచనా. ఇందులో 2 ఎకరాలు పార్కు కోసం కేటాయించినది కాగా, 5 ఎకరాలు శ్మశాన వాటికతో పాటు 4 ఎకరాల డంప్ యార్డుకు చెందినది ఉంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సెంట్రల్ పార్కు కాలనీలో పార్కు కోసం 2 ఎకరాలు కేటాయించారు. సర్వే నంబరు 110/1లో 148 ప్లాట్లతో 16 ఎకరాల మేర సెంట్రల్ పార్కు కాలనీ ఫేజ్-1 పేరుతో 1998లో లే ఔట్ వేశారు. ఇందులో 2 ఎకరాలను పార్కు కోసం కేటాయించగా, మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. ఇలా పార్కు కోసం కేటాయించిన భూమి తమదంటూ కొంతమంది ఆక్రమణలకు పాల్పడడం, కాలనీవాళ్లు అడ్డుకుంటే వారిని బెదిరించడం వంటి ఘటనలు పలుమార్లు జరిగాయి.దీనిపై హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 2 ఎకరాల పార్కు స్థలంగా నిర్ధారించింది. పార్కులో తాత్కలికంగా వేసిన షెడ్డులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం తొలగించింది. 2 ఎకరాల పార్కు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువుకు ఆనుకుని ఉన్న 5 ఎకరాల శ్మశానవాటికతో పాటు.. ఆ పక్కనే ఉన్న 4 ఎకరాల డంపింగ్ యార్డు ఆక్రమణలకు గురౌతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో విచారించింది. కూకట్‌పల్లి మండలంలోని బాగామేరి విలేజ్ సర్వే నంబరు 103లో ఉన్న ఈ భూమిని శ్మశానవాటికకు, చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించిందిగా నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు 9 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అనంతరం బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రగతి నగర్ చెరువుకు ఆనుకుని ఉన్న ఈ భూమిని కబ్జాల పాలవ్వకుండా కాపాడిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఫిర్యాదులు అధికారులకు అందజేశామని హైడ్రా ఎంట్రీతో ఈ సమస్య పరిష్కారం అయ్యిందని సంతోషం వ్యక్తం చేశారు.

# తెలంగాణలోకి 13 ప్రఖ్యాత యూకే స్కూల్స్ క్యాంపస్‌లు

- **వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్ కల్గిన హైదరాబాదుకే యూకే విద్యా సంస్థల జై**
- **నేడు రాష్ట్రంలో యూకే ప్రతినిధి బృందం టూర్**
- **రాష్ట్ర ఉన్నతాధికారులు, యూకే ప్రతినిధులతో కీలక సమాలోచనలు**

**బలగం టీవి, హైదరాబాద్**

దేశంలోనే అత్యద్భుతమైన వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్ కల్గిన హైదరాబాదు మహానగరానికే అంతర్జాతీయ సంస్థలు జై కొడుతున్నాయి. ఇదివరకు ఐటీ కంపెనీలు, బయో సంబంధిత సంస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు ఆసక్తి చూపుతుండగా... తాజాగా విద్యా సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు చెందిన 13 ప్రఖ్యాత పాఠశాలలు హైదరాబాద్ నగరంలో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ మేరకు యూకే ప్రభుత్వం నుంచి తెలంగాణ సర్కారుకు గ్రీన్ సిగ్నల్ అందింది. అందులో భాగంగా యూకే డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. రేపు(మార్చి 18న) రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నతాధికారులతో యూకే ప్రతినిధులు కీలక సమాలోచనలు జరపనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటు మేరకు అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలోకి ఆహ్వానించేందుకు ప్రజా ప్రభుత్వం తీవ్ర కసరత్తులు చేస్తున్నది. ఈ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంలో 13 యూకే స్కూల్స్ కు సంబంధించిన రిప్రజెంటేటివ్స్, యూకే ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు. తెలంగాణలోకి రానున్న ప్రైవేటు విద్యా సంస్థలు, కేజీ టూ ప్లస్ 2 కరికులంలో అగ్రగామిగా పేరొందాయి. స్థానికంగా విద్యా శాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖలు మున్సిపల్, విద్యా, ఐటీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన అధికారులు చర్చించనున్నారు. ఈ విషయంలో మరింత సమన్వయం, యూకే విద్యా సంస్థలు మన రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయేవాటికి ఏ విధమైన టైమ్ లైన్ ను నిర్దేశించుకుని వెళ్ళాలో చర్చలు సాగనున్నాయి. అయితే, యూకేకు సంబంధించిన విశ్వవిద్యాలయాలు సైతం తెలంగాణలో వారి క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలన్నీ ఒక కీలక దశకి చేరుకున్న విషయం విదితమే. ఈ క్యాంపస్‌లు ఎక్కడ పెట్టాలన్న దానిపై తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు సమగ్రంగా చర్చలు చేస్తున్నప్పటికీ, మరోవైపు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే ప్రత్యేకంగా ఒక ఎడ్యుకేషన్ జోన్ లో వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడుగులు పడుతున్నాయి.

# ముఖ్యమంత్రిపై సొంత పార్టీ నేతలకే నమ్మకం లేదు

- **మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద**

**బలగం టీవి, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకులు లెజిస్లేటివ్ పార్టీ సమావేశానికి హాజరు కాకపోవడం హాస్యాస్పదమనీ, రాష్ట్రంలో నిధుల కొరత తీవ్రంగా ఉందని.. దీనివల్ల కాంగ్రెస్ నాయకులు సొంత నియోజకవర్గాల్లోని గ్రామాల్లో తిరగలేకపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలే కాకుండా, ఆ పార్టీ నాయకులకే నమ్మకం లేదన్నారు. సొంత పార్టీ నేతలపై ముఖ్యమంత్రికి విశ్వాసం లేదని, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై వారి పార్టీ నేతలకు నమ్మకం లేదన్నారు. "99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కేవలం తొమ్మిది రోజులకే బోర్లా పడిందని విమర్శించారు. కనీసం ఈ కార్యక్రమానికి ఎలాంటి విధి విధానాలూ లేవని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నాయకత్వం పట్ల ప్రజలు పూర్తిగా విశ్వాసం కోల్పోయారని, గడిచిన రెండేండ్లలో రాష్ట్రంలో ఒక్క సరైన ప్రణాళిక లేదని, అసలు అడ్మినిస్ట్రేషన్ అన్నదే లేదని విమర్శించారు.

రైతులకు ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. కాంగ్రెస్ 'ప్రభుత్వ వైపరీత్యం' మొదలైంది: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై, రైతులను నష్టాల ఊబిలోకి నెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఒక్క కొనుగోలు కేంద్రమూ ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులు బయట మార్కెట్లలో తమ పంటను తక్కువ ధరకే అమ్ముకుంటూ, క్వింటాలుకు రూ. 700 వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి చేతికి రాక రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుబంధు లేదు, కరెంటు లేదు, కనీసం పంట కొనుగోలూ లేదన్నారు. రైతులకు పకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైపరీత్యమూ ప్రారంభమైందని ఎమ్మెల్యే ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రికి రైతుల సమస్యలపై కనీస శ్రద్ధ లేదని, కేవలం 'ఫ్యూచర్ సిటీ' వంటి ప్రాజెక్టుల మీదే ధ్యాస పెట్టారని ఆరోపించారు. రైతులను ఆత్మహత్యల వైపునకు నెట్టవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మొక్కజొన్న రైతులను ఆదుకోవడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**కరీంనగర్ సీపీ అరాచకాలు శృతిమించాయి :**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

కరీంనగర్ సీపీ ఆలం గౌస్ అరాచకాలు శృతిమించాయనీ, ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ సీపీ ఆలం గౌస్ తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి బోనాలపల్లిలో ఇష్టానుసారంగా ఫైరింగ్ చేస్తున్నారనీ, ఈ క్రమంలో అమృతమ్మ అనే వృద్ధురాలికి గాయమైందని తెలిపారు. 180 బుల్లెట్లతో ఫైరింగ్ జరిగిందని విమర్శించారు. హోంగార్డుల నుంచి ట్రాన్స్‌ఫర్ల పేరుతో రూ. లక్షల వసూళ్లు చేస్తున్నారనీ, ఐఆర్ఎస్ అధికారి తండ్రి కోసం ప్రభుత్వ వాహనాన్ని వాడుతున్నారని ఆరోపించారు. సీపీ అక్రమాలు తెలిసినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఆయనకు డబ్బుల మూటలు అందుతున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. మహేష్ కుమార్ గౌడ్‌కు సవాల్ విసురుతూ, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరికీ డ్రగ్స్, మద్యం పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తన వద్ద మరిన్ని ఆధారాలు ఉన్నాయనీ, త్వరలోనే బయటపెట్టి "బాంబు బ్లాస్ట్" చేస్తానని హెచ్చరించారు. ఈ విషయాన్ని స్పీకర్ అనుమతితో అసెంబ్లీలో లేవనెత్తుతానని స్పష్టం చేశారు.

**గవర్నర్ ప్రసంగాన్ని కేటీఆర్ పదేపదే తప్పుదోవ పట్టిస్తున్నారు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రామచంద్రు నాయక్, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి**

గవర్నర్ ప్రసంగాన్ని కేటీఆర్ పదేపదే తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రామచంద్రు నాయక్, కుంభం అనిల్‌కుమార్ రెడ్డితో కలిసి మాట్లాడారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక విధ్వంసం చేశారన్నారు. అసెంబ్లీలో సబ్జెక్ట్ మాట్లాడడండీ అనిచెప్పిన ఆది శ్రీనివాస్‌ను ట్రోల్ చేస్తున్నారన్నారు. ఆది శ్రీనివాస్ పెట్టుకున్న వాచీ ఖరీదు రూ.కోటి అని కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆ వాచ్ కోటి రూపాయల ఖరీదు చేస్తే మీరు రూ. 30 వేలు ఇచ్చి తీసుకోండి అని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం మీద దెబ్బ కొట్టొద్దన్నారు. బీసీ బిడ్డ ఆది శ్రీనివాస్ ఎంతో కష్టపడి పైకొచ్చారన్నారు. ఆయనపై చేసిన తప్పుడు ఆరోపణలను వెనక్కి తీసుకొని కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. పాడి కౌశిక్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఆత్మాభిమానం, మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని, డ్రగ్స్‌కు అలవాటు పడ్డ ముఠా బ్యాచ్ కాబట్టి వారి ప్రవర్తన అసెంబ్లీలో అహంకారంగా ఉందని తెలిపారు. పోలీస్ శాఖలో హాఫ్ ఇయర్లీ, ఇయర్లీ వెపన్ ప్రాక్టీస్ (ఫైరింగ్) ఉటుందని, దానికి కుటుంబ సభ్యులను కూడా పిలవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రయివేటు వ్యక్తులతో ఫైరింగ్ చేయించడం జరగదన్నారు. పోలీస్ అధికారులపై కౌశిక్‌రెడ్డి కావాలని తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి గుండాయిజంతో ప్రవర్తిస్తున్నాడని, ఏకవచనంతో పోలీసు అధికారులను హెచ్చరిస్తున్నారన్నారు.

ఆది శ్రీనివాస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారు

ఆది శ్రీనివాస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ అన్నారు. కేటీఆర్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌నే చదువుతున్నారని, గతంలో మంత్రి సీతక్కపై కూడా అసత్య ప్రచారాలు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌ను ప్రశ్నిస్తున్నందుకే ఆది శ్రీనివాస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. 10ఏండ్ల కాలంలో సంక్షేమ పథకాలు అమలుచేయడం చేతకాలేదన్నారు. సొంత చెల్లెలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేశారన్నారు. కాళేశ్వరం, అంబేద్కర్ విగ్రహంతోపాటు ఇతర ప్రాజెక్టుల్లో ప్రతి దాంట్లో అవినీతి జరిగిందని సొంత చెల్లెలు మాట్లాడితే దానికి సమాధానం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను గతంలో బంగారు తెలంగాణ పేరుతో తప్పుదోవ పట్టించి, ఇప్పుడు మళ్ళీ ప్రతిపక్షంలో ఉండి తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితులు లేవన్నారు.

**బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోంది.. నా వాచ్‌ను మీకే ఇచ్చేస్తా: ఆది శ్రీనివాస్**

బీఆర్ఎస్‌ను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నందుకు తన వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేటీఆర్ అసెంబ్లీ సాక్షిగా పదేపదే అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కామ్‌లతోపాటు సొంత చెల్లెలును ఇంటి నుంచి వెళ్లగొట్టినప్పటి నుంచి అడుగుతున్న వాటిపై సమాధానాలు చెప్పలేకపోయారన్నారు. తమ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. తాను పెట్టుకున్న వాచి రోలాక్స్ అని, కోటి రూపాయల విలువ చేస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 'మేకేల్ కోర్స్' కంపెనీకి చెందిన తన వాచ్ రూ.10వేల నుంచి 40వేల వరకు విలువ చేస్తోందని, అది దుబాయ్‌లో ఉన్న తన స్నేహితుడు గిఫ్ట్‌గా ఇచ్చారని తెలిపారు. రూ.97లక్షల నుంచి కోటి రూపాయలంటున్నారు కదా ఆ వాచ్‌ను కేటీఆర్‌కైనా లేదా కేసీఆర్‌కు, హరీశ్‌రావులకు ఫ్రీగా ఇచ్చేస్తానన్నారు. దుబాయ్ కేంద్రంగా వాట్సప్ గ్రూపుల ద్వారా ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలు దేవుళ్ళని, ప్రజలకు నా వ్యక్తిత్వం తెలుసన్నారు. దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. మీ పదేండ్ల పాలనలో ఎంతో మానసిక ఇబ్బంది పెట్టినా తట్టుకొని ఇక్కడివరకు వచ్చానని గుర్తు చేశారు. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా తన ఫోటో తీయడంపై స్పీకర్‌కు కంప్లైంట్ చేస్తానన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ట్రాన్స్ జెండర్ బిల్లును వెనక్కి తీసుకోవాలి

**తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మోనాలిసా**




**బలగం టీవి, హైదరాబాద్**

2026 ట్రాన్స్ జెండర్ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మోనాలిసా డిమాండ్ చేశారు. తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల అస్తిత్వంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని కార్యకర్తలు నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షురాలు మాట్లాడుతూ కొత్త చట్టం ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉండటంతో పాటు సుప్రీంకోర్టు తీర్పులను ధిక్కరించే విధంగా ఉందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు హరించబడుతున్నాయని, హక్కులను కాలరాసే ఏ చట్టాన్నైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో తిప్పికొట్టడం తమ హక్కు అన్నారు. ట్రాన్స్ జెండర్ హక్కులను కాలరాస్తే.. కాలగర్భంలో కలిసిపోతారని హెచ్చరించారు. అతి త్వరలో మేధావులు ప్రజాసంఘాలు సామాజిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఆల్ ఇండియా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధి రచన ముద్రబోయిన మాట్లాడుతూ కొత్త నిబంధనలు ట్రాన్స్‌జెండర్లపై వివక్షను మరింత పెంచేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ గుర్తింపును తామే నిర్ణయించుకునే హక్కును ప్రభుత్వం పరిమితం చేయాలని చూస్తోందని, దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వివాదాస్పద 2026 ట్రాన్స్‌జెండర్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ట్రాన్స్‌జెండర్లకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రక్షణ కల్పించాలని కోరారు. సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ట్రాన్స్‌జెండర్లపై జరుగుతున్న అణచివేతను అడ్డుకోవాలన్నారు. బుధవారం(నేడు) ధర్నా చౌక్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్తలు రింకు, పప్పీ, సోనా రాథోడ్, అక్షర, నిత్య, వాసవి,, శతి, సిల్క్ అప్పు, అభి తదితరులు పాల్గొన్నారు




## మల్లారెడ్డి 50వ వివాహ వార్షికోత్సవ వేడుకలకు కేటీఆర్ హాజరు

**బలగం టీవి, కొంపల్లి**

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి -- కల్పన దంపతుల 50వ వివాహ వార్షికోత్సవ వేడుకలు కొంపల్లిలోని ఆయన కుమారుడు భద్రారెడ్డి నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన హల్దీ, మెహందీ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరై పుష్పగుచ్ఛం అందించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ నేటి యువ దంపతులు అన్యోన్యంగా జీవితం కొనసాగించేందుకు తమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన కోడలు ప్రీతి రెడ్డి దాండియా నృత్యంతో మల్లారెడ్డి -- కల్పన దంపతులకు స్వాగతం పలికారు. మనవరాళ్లు కూడా నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వేడుకలకు మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ యూనివర్సిటీస్ సెక్రటరీ చామకూర మహేందర్ రెడ్డి, చామకూర శాలిని రెడ్డి, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠం చైర్మన్ భద్రారెడ్డి అతిథులను ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, సినీ హీరో అక్కినేని నాగచైతన్యతో పాటు సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు హాజరై దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త.


**బలగం టీవి, హైదరాబాద్**

భార్యను గొంతు కోసి భర్త హత్య చేసిన దారుణ ఘటన హైదరాబాద్ సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ లోని వాసవి బందావన్ అపార్ట్మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నరేష్ తన భార్య రేణుక(38), ముగ్గురు కుమార్తెలతో జీవిస్తున్నాడు. అయితే నాలుగు రోజులుగా రేణుక గుర్తు తెలియని వ్యక్తులతో ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతుండగా భర్త గమనించి మందలించాడు. అయినా ఆమె తన భర్తను లెక్కచేయకుండా మంగళవారం మధ్యాహ్నం ఫోన్‌లో మాట్లాడుతుండగా, గమనించిన నరేష్ ఆగ్రహానికి లోనై కూరగాయలు కోసే కత్తితో భార్య గొంతు కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. దాంతో ఆమె మృతి చెందింది. గమనించిన వారి కుమార్తెలు సమీప బంధువులకు సమాచారం అందించగా వారు వచ్చి సనత్‌నగర్ పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించి కేసు నమోదు చేశారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.త్వరలో నిందితుడుని అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## పాఠశాల కార్యక్రమంలో బాలికల అభ్యంతరకర డ్యాన్స్ వీడియో వైరల్

**ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు**


**బలగం టీవి, కోల్‌కతా**




పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని ఓ పాఠశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ఇద్దరు బాలికలు బాలీవుడ్ పాటకు టవల్ ధరించి డ్యాన్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదానికి దారి తీసింది. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమాలోని 'మేరే ఖ్వాబోం మే' పాటకు నటి కాజోల్ ధరించిన విధంగా తెల్లటి టవల్‌తో బాలికలు వేదికపై నృత్యం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. పాఠశాలలు పవిత్రమైన ప్రదేశాలుగా భావించే నేపథ్యంలో ఇలాంటి ప్రదర్శనలు అనుచితమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. యువతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై ఫిర్యాదులు అందడంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పందించి పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఆక్సిజన్‌తో పరీక్ష రాసిన విద్యార్థి

**బలగం టీవి, అమరావతి**



రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షల తొలిరోజే రెండు భిన్న ఘటనలు చోటుచేసుకుని చర్చనీయాంశమయ్యాయి. ఒకచోట ప్రాణాలతో పోరాడుతున్న విద్యార్థి పట్టుదల అందరినీ స్ఫూర్తి పరచగా, మరోచోట విధుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం విషాదాన్ని నింపింది.

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన కట్టా కౌశిక్‌చంద్ తీవ్ర ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అతనికి ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. అయితే, భారీ ఖర్చుతో కూడుకున్న ఈ చికిత్సకు కుటుంబానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రస్తుతం ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారు. అయినప్పటికీ చదువుపై ఆసక్తి కోల్పోని కౌశిక్ ప్రత్యేక అనుమతి పొంది కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రానికి ఆక్సిజన్ సిలిండర్‌తో హాజరయ్యాడు. ముక్కుకు మాస్క్ పెట్టుకుని ఆక్సిజన్ తీసుకుంటూనే తెలుగు పరీక్ష రాసి తన అకుంఠిత దీక్షను చాటుకున్నాడు. అతని పట్టుదల అందరినీ కదిలించింది.

కర్నూలు జిల్లాలోని మరో ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నిడ్జూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అన్వర్‌బాషా, మాధవనగర్‌లోని ఒక పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులకు హాజరయ్యారు. సోమవారం ఉదయం విధులు నిర్వహిస్తుండగా ఆయనకు అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయారు.సిబ్బంది వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆయన మరణించారు. అన్వర్‌బాషాకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భార్య కూడా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆయన అకాల మరణంతో తోటి ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## తిరుమలలో భక్తుల రద్దీ

**బలగం టీవి, తిరుమల**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సర్వదర్శనం కోసం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.సోమవారం ఒక్కరోజే 70,606 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. అదేవిధంగా 28,415 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.39 కోట్లుగా నమోదైంది.

## హనీట్రాప్ సైబర్ మోసాలపై హైదరాబాద్ సీపీ హెచ్చరిక

**బలగం టీవి, హైదరాబాద్**




మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఒంటరితనానికి అలవాటు పడుతున్న యువతను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ నగర పోలీసులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో "ఒంటరిగా ఉన్నారా? అందమైన అమ్మాయిలతో మాట్లాడండి" వంటి ఆకర్షణీయ ప్రకటనల ద్వారా యువతను వలలో వేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ విషయంపై నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. వీడియో కాలింగ్, డేటింగ్ యాప్‌ల పేరుతో జరుగుతున్న హనీట్రాప్ మోసాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో తయారు చేసిన నకిలీ వీడియోలను ఉపయోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇలాంటి లింక్‌ల ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వెంటనే ఫోన్‌లోని కాంటాక్ట్స్, ఫోటోలు, వ్యక్తిగత వివరాలు సైబర్ నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. తర్వాత వీడియో కాల్ ద్వారా నకిలీ అసభ్య వీడియోలు చూపించి బాధితుల ముఖాన్ని రికార్డ్ చేసి మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేసే 'సెక్స్‌టార్షన్'కు దిగుతున్నట్లు వివరించారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. క్షణికావేశంలో తెలియని యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని, ఇప్పటికే మోసపోయిన వారు పరువు భయంతో మౌనంగా ఉండకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



## హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడులు

- **నలుగురు నిర్వాహకులు, 34 మంది కస్టమర్లపై కేసులు నమోదు**

**బలగం టీవి, హైదరాబాద్**

అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై ఎల్‌బీ నగర్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 4 మంది నిర్వాహకులతో పాటు హుక్కా సేవిస్తున్న 34 మంది కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు.

ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌గాంధీనగర్‌లో ఉన్న 'వైట్ ఖాఫ్ కేఫ్'లో హుక్కా సేవిస్తున్న వారిని పోలీసులు గుర్తించి చర్యలు చేపట్టారు. ఈ కేసులో నిర్వాహకులుగా రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన గోరుసు పూర్ణ సాయికుమార్, మహ్మద్ షకీల్, సరూర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సోహిల్ అలియాస్ పర్వాన్, చంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ ఖాదీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హుక్కా పాట్స్, మొబైల్ ఫోన్లు, లౌడ్‌స్పీకర్లు, ప్రొజెక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిర్వాహకుడిగా భావిస్తున్న మోహన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

balagamtv100@gmail.com

# టాలీవుడ్ హీరోకు షాక్ ..



## 'పెళ్లయిన 3 రోజులకే భార్య వదిలేసి వెళ్లిపోయింది'..!

విడాకులు కూడా కాదు.. పెళ్లయిన మూడు రోజులకే భార్య వదిలేసి వెళ్లిపోయింది.. ఇదీ టాలీవుడ్ యంగ్ హీరో తిరువీర్ నటిస్తున్న 'పాపం ప్రతాప్' స్టోరీ లైన్.. చాలా కొత్తగా ఉంది కదూ.. అవును ఆయన సినిమాలన్నీ కొత్త కాన్సెప్ట్ తోనే ఉంటాయి. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు తిరువీర్. ఇటీవల ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ఈ యంగ్ హీరో.. ప్రస్తుతం పాపం ప్రతాప్ అనే యూనిక్ స్టోరీ చేస్తున్నాడు. అయితే ఈ స్టోరీ లైన్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతోంది. ఈ మూవీ సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10 న థియేటర్లలో విడుదల కానుంది. మసూద, పరేషాన్, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించిన హీరో తిరువీర్. చిన్న సినిమాలతోనే హిట్ కొట్టడం ఈ హీరో ప్రత్యేకత. గతేడాది ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ఈ యంగ్ హీరో.. ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పాపం ప్రతాప్'.. ఈ చిత్రంలోని సరికొత్త స్టోరీ లైన్ కారణంగా ఈ మూవీపై ప్రేక్షకులకు అంచనాలు పెరిగాయి. ఇక ఈ మూవీ వేసవి కానుకగా ఏప్రిల్ 10 న విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ పేర్కొంది. ఇక పక్కా విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన ఈ మూవీకి ఎస్. పీ దుర్గ నరేష్ దర్శకత్వం వహించారు. రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాయల్ రాధకృష్ణ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఇక రీజినల్ కంటెంట్ ను అందిస్తూ దూసుకెళ్తోన్న ఓటీటీ ప్లాట్ ఫార్మ్ ఈటీవీ విన్.. ఈ చిత్ర ఓటీటీ హక్కులను కొనుగోలు చేసింది. గతేడాది లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, అనగనగా, కానిస్టేబుల్ కనకం, ూ×= వంటి వరుస విజయవంతమైన ఒరిజినల్స్ అన్ని వయస్సుల ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే.. ఈ విజయ పరంపర జుఎ ఔఱఅను రీజినల్ ూు రంగంలో ఒక బెంచ్ మార్క్ గా నిలిపింది.

# ఎట్టకేలకు మనసులో మాట బయటపెట్టిన కాయదు లోహర్!



ప్రముఖ నటి కాయదు లోహర్ తన అందం తో నటనతో దక్షిణాది సినీ ప్రేక్షకుల ను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. మోడలింగ్ రంగం నుంచి సినిమా ప్రపంచంలోకి ప్రవేశించిన ఈ ముద్దు గుమ్మ.. అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపును సంపాదించు కున్నారు. టాలీవుడ్, దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కాయదు లోహర్.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్ ప్రయాణం గురించి ఎంతో హుందాగా, సరదాగా ముచ్చటించారు. తన పెళ్లి, ప్రేమ జీవితంపై వస్తున్న ఊహాగానాలకు ఆమె తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇంటర్వ్యూలో భాగంగా తన వైవాహిక జీవితం గురించి యాంకర్ అడిగిన ప్రశ్నకు కాయదు లోహర్ ఏ మాత్రం తడబడకుండా.. "అవును, నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అని చాలా స్పష్టంగా, నిజాయితీగా సమాధానమిచ్చారు. తన జీవితంలో పెళ్లి అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని.. సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా ఆ నిర్ణయం తీసుకుంటానని ఆమె పరోక్షంగా సూచించారు. ప్రస్తుతం కాయదు లోహర్ రిలేషన్ షిప్ స్టేటస్ గురించి అభిమానుల్లో ఎప్పుడూ ఆసక్తి ఉంటుంది. ఈ వీడియోలో.. "ప్రస్తుతం మీరు ఏ స్థితిలో ఉన్నారు? కమిటెడ్ ఆ లేక సింగిలా?" అని అడిగినప్పుడు.. ఆమె చాలా తెలివిగా తన కెరీర్ పట్ల ఉన్న నిబద్ధతను చాటుకున్నారు. "నేను ప్రస్తుతం నా పనికి కమిటెడ్" అంటూ ఆమె నవ్వుతూ ఇచ్చిన సమాధానం అందరినీ ఆకట్టుకుంది. తన వృత్తిని ఎంతగా ప్రేమిస్తుందో చెప్పడానికి ఈ సమాధానమే నిదర్శనం. ఈ ఇంటర్వ్యూ మొత్తం చాలా స్నేహపూర్వకంగా, నవ్వులతో సాగింది. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రశ్నలను ఏ మాత్రం ఇబ్బంది పడకుండా ఎంతో హుందాగా స్వీకరించింది కాయదు లోహర్. కాయదు లోహర్ ముఖంలో కనిపించిన చిరునవ్వు, ప్రతి ప్రశ్నకు ఇచ్చిన జవాబులు ఇంటర్వ్యూకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తనను తాను ఎలా ప్రెజెంట్ చేసుకోవాలో కాయదుకి బాగా తెలుసని ఈ వీడియో చూస్తే అర్థమవుతుంది. చివరగా.. తన కెరీర్, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత గురించి మాట్లాడుతూ.. "నేను మీకు చాలా సింపుల్ అండ్ స్ట్రెయిట్ ఆన్సర్ ఇస్తున్నాను" అని చెప్పడం ద్వారా, తాను దేనికీ అతిగా ప్రాధాన్యత ఇవ్వకుండా, తన పనిని, జీవితాన్ని ఎలా ఆస్వాదిస్తుందో వివరించారు.




# వింటేజ్ పవర్‌స్టార్‌ని చూస్తారు



'పవన్‌కల్యాణ్ సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. ఇండస్ట్రీకి వచ్చిన నాటి నుంచి పవన్ స్టార్‌డమ్ గురించీ, పవనిజం గురించి వింటూవుండేదాన్ని. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని కలలు కనేదాన్ని. 'ఉస్తాద్ భగత్‌సింగ్'తో నా కల నిజమైంది' అంటూ ఆనందం వెలిబుచ్చింది నటి రాశీఖన్నా. పవన్‌కల్యాణ్‌కి జోడీగా ఆమె నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం రాశీఖన్నా మీడియాతో ముచ్చటించింది."గబ్బర్‌సింగ్' లాగే ఇది కూడా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. ఇదొక ఫ్యామిలీ సినిమా. ఇందులో వింటేజ్ పవర్‌స్టార్‌ని చూస్తారు. ఇందులో నా పాత్ర పేరు శ్లోక. మోడరన్ అమ్మాయి. కథలో ప్రాధానత్య ఉన్న పాత్ర. దర్శకుడు హరీశ్‌శంకర్ ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన చాలా స్మార్ట్. మాస్ పల్స్ తెలిసిన డైరెక్టర్. సాధారణంగా 120రోజులు పట్టే షూటింగ్‌ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశారు. సరిగ్గా నిద్ర కూడా పోకుండా ఈ సినిమాకోసం కష్టపడ్డారు. లొకేషన్లోనే డైలాగులు కూడా రాసిచ్చేవారు. వృత్తిపట్ల ఆయనలోని అంకితభావం నన్నెంతో ఆకర్షించింది.మేం కూడా పవన్‌కల్యాణ్ టైమింగ్స్‌కి అనుగుణంగా పగలు రాత్రి తేడా లేకుండా కొన్నిసార్లు 24గంటల షిఫ్టులు పనిచేశాం' అని తెలిపింది రాశీఖన్నా. శ్రీలీల కాంబినేషన్ సీన్స్ తనకు లేవని, ప్రతి పాత్రా దేనికదే ప్రత్యేకంగా ఉంటుందని, మైత్రీ అధినేతలు నవీన్, రవిశంకర్ సినిమాకోసం ప్రాణం పెట్టే నిర్మాతలని, బడ్జెట్ విషయంలో రాజీ పడరని, ఈ సంస్థలో మళ్లీ మళ్లీ సినిమాలు చేయాలనుందని ఆశాభవం వ్యక్తం చేసింది రాశీఖన్నా.

# ఎమోషన్స్‌తో కూడిన ఏజ్‌గ్యాప్ లవ్‌స్టోరీ



తమిళ అగ్ర నటుడు సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు పానిండియా సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితాబైజు కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. జూలైలో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 40ఏళ్ల వయసులో కూడా తన కలలను వదలకుండా ముందుకు సాగే, అంతర్జాతీయ పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్‌గా సూర్యని ఈ టీజర్ పరిచయం చేసింది. తండ్రి ప్రేమ, భావోద్వేగాలతో కూడుకున్న గాఢమైన పాత్రలో ఇందులో ఆయన కనిపించనున్నట్టు టీజర్ చెబుతున్నది. వెంకీ అట్లూరి ప్రభావ వంత మైన సంభాషణలు, సూర్య నటన, కథకు కొత్తదనాన్ని జోడించిన మమితా బైజు పాత్ర టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణ లుగా నిలిచాయి. వయస్సు అంతరంతో కూడిన అసాధా రణ ప్రేమకథ ఇదని టీజర్ చెబుతోంది. సార్, లక్కీభాస్కర్ చిత్రాల తర్వాత రానున్న ఈ వెంకీ అ ట్లూరి చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల మన సుల్ని గెలుస్తుందని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. రాధిక శరత్‌కు మార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మా ణం: సితార ఎంటర్‌టైన్మెట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్.


# ఈ ఇద్దరు కలిసి వస్తే థియేటర్లు తగలబడడమే..



## కొత్త మూవీ టీజర్ రిలీజ్ !!

విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం "కార్మేని సెల్వం". ఈ మూవీలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రామ్ చక్రి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మిస్తున్నారు. అలానే లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ మూవీని థియేటర్స్ లోకి తీసుకొస్తుంది. ఆధు నిక కాలానికి అనుసంధానమైన ఈకథ ఇప్పటికే విడు దలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని పెంచగా.. లేటె స్ట్ గా తెలుగు టీజర్ ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. "డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి" అని సముద్రఖని వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. కాగా అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవం తులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయా లను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్లఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టుకుం టుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించబోతున్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృద యానికి హత్తుకునేలా ఉంటాయి. అలానే లక్ష్మీ ప్రియా చంద్రమౌళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచు తున్నాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచడం కూడా ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. టీజర్ చివర్లో.. "రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలి... డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి"-అని సముద్రఖని చెప్పే డైలాగ్ ప్రేక్షకు లలో ఆలోచన రేకెత్తించేలా నిలుస్తుంది. నటన పరంగా మెస్మరైజ్ చేసే సముద్రఖని, గౌతమ్ వాసుదేవ్ మీనన్ కలి సి నటిస్తుండడంతో మూవీపై అంచనాలు పెరిగిపోయాయి.

# సల్మాన్ ఖాన్ బ్యాటిల్ ఆఫ్ గల్వాన్‌కు 'మాతృభూమి' టైటిల్..




బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' (దీఫ్శ్రీవ శీట +ఖశ్రీఝఅ). అపూర్వ లాఖియా దర్శకత్వంలో భారతదేశం-చైనా సరిహద్దులో 2020లో జరిగిన గల్వాన్ లోయ సంఘటన ఆధారంగా వార్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రంలో బాలీవుడ్ భామ చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. రిలీజ్ టైం దగ్గర పడుతున్న క్రమంలో ఈ ప్రాజెక్ట్ ఊహించని నిర్ణయంతో వార్తల్లో నిలిచింది.ఈ మూవీ టైటిల్‌ను బ్యాటిల్ ఆఫ్ గాల్వన్ నుంచి 'మాతృభూమి'గా మార్చారు. కొత్త టైటిల్‌తో డిజైన్ చేసిన పోస్టర్‌ను కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేశారు మేకర్స్. అయితే అనూహ్యంగా చేసిన టైటిల్ మార్పు ఇంతకీ కారణమే ఉంటుందా..? అని అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాటీ పెంచుతోంది. ఈ మూవీ టీజర్ విడుదలైన తర్వాత ఈ చిత్రంలో గాల్వన్ యుద్ధానికి సంబంధించి వాస్తవాలను వక్రీకరిస్తున్నారంటూ చైనీస్ స్టేట్ రన్ చేస్తున్న మీడియా కొత్త వివాదానికి తెరలేపింది. అయితే దీనిని భారత ప్రభుత్వ నిషేధంగా కంటే కూడా బాహ్యంగా రాజకీయ ఎదురుదెబ్బగా భారత నివేదికలు పేర్కొంటున్నాయి.ఈ క్రమంలో తాజాగా సల్మాన్ ఖాన్ అండ్ టీం తీసుకున్న టైటిల్ మార్పుతో ఇక వివాదానికి ముగింపు పడ్డట్టేనని.. ఒరిజినల్ టైటిల్‌పై వచ్చిన అభ్యంతరాల ఫలితంగా మేకర్స్ ఇలాంటి నిర్ణయం తీసుకుందని కొత్త పోస్టర్‌తో క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఈ మూవీలో సల్మాన్ ఖాన్ తెలంగాణకు చెందిన వీర సైనికుడు, గల్వాన్ వీరుడు కల్నల్ సంతోష్ బాబు పాత్రలో కనిపించబోతున్నట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. కాగా దీనిపై మేకర్స్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. సల్మాన్ ఖాన్, చిత్రాంగద సింగ్ కాంబోలో వస్తోన్న తొలి సినిమా ఇది.